thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 138 | జగిత్యాల | గురువారం 20 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహమ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

## మౌలిక రంగానికి రూ.13 వేల కోట్లు



- ఐదు భారీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా
- 4 రైల్వే ప్రాజెక్టులకు రూ.9,450 కోట్లు
- గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు రూ.2,229 కోట్లు
- బిహార్‌లో నాలుగు వరుసల రహదారికి రూ.3,591 కోట్లు
- రైల్వే రద్దీ తగ్గింపు.. సరుకు రవాణా సామర్థ్యం పెంపే లక్ష్యం

4

## నీట్ లీక్‌పై సుప్రీం సీరియస్

- ఎన్‌టీఏలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిందే
- తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత వ్యవస్థ ఉండాలని స్పష్టీకరణ
- ప్రశ్నపత్రాల భద్రత, సైబర్ సెక్యూరిటీపై పూర్తి వివరాలు కోరిన ధర్మాసనం
- సంస్థాగత మార్పులపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
- ఎన్‌టీఏ సంస్కరణలను పర్యవేక్షిస్తామన్న సుప్రీంకోర్టు

4





## గురువునే కడతేర్చిన విద్యార్థులు!

- ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు
- పదో తరగతి చదివిన ఇద్దరు మైనర్లే నిందితులని పోలీసుల నిర్ధారణ
- ముందుగానే ఇంట్లోకి చొరబడి వంటగదిలో మాటు
- రూ.2 లక్షల కోసం దారుణ హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడి
- గంజాయి, జల్సాలకు అలవాటుపడి ఘాతుకానికి తెగబడినట్లు గుర్తింపు

చదువు చెప్పిన గురువుపైనే కత్తి దూశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 27 సార్లు పొడిచి ప్రాణాలు తీశారు. అనంతరం ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని సుమారు రూ.2 లక్షల నగదుతో పరారయ్యారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన విషయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘాతుకానికి పాల్పడింది ఆమె వద్ద చదువుకున్న పదో తరగతి విద్యార్థులేనని పోలీసులు గుర్తించారు.

2

# 22/ఏ సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

- ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి
- పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
- అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 19:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా భూ యజమానుల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని చేపట్టింది. 22ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతో రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22ఏ సమస్యపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించారు.

మిగతా 2 లో



2

## ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



## కాంగ్రెస్‌లో 'కొండా' కలకలం!

- టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి స్వతంత్ర పోటీకి సిద్ధం
- 'సీఎం రేవంతా.. పొంగులేటా?' అంటూ సుష్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు
- కొండా మురళికి ఇచ్చిన ఎమ్మెల్సీ హామీ ఏమైందని ప్రశ్న
- సీఎం కుటుంబంపై అవినీతి ఆరోపణలు.. మరిన్ని బయటపెడతానని హెచ్చరిక
- వ్యాఖ్యలను ఖండించిన మల్లు రవి.. చర్యలు తప్పవని స్పష్టీకరణ

2

## ఓట్ల తొలగింపునకు ఎస్ఐఆర్ అస్త్రం

కేంద్రానివి కుట్రపూరిత రాజకీయాలు

బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్‌ను దెబ్బతీసే ప్రయత్నం

- దళిత, గిరిజన, మైనారిటీ ఓట్లే లక్ష్యమని ఆరోపణ
- బూత్‌స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం

2



## కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

- నసీర్ మాత్రీ సంచలన వ్యాఖ్యలు



4



## బాలికల జీవితాలతో చెలగాటం.. 33 మందికి శిక్ష

- వ్యభిచార రొంపిలోకి మైనర్లను దింపిన ముఠాపై నాంపల్లి పోక్సో కోర్టు కొరడా
- ఐదుగురికి జీవిత ఖైదు.. మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు
- 14 మందికి పదేళ్ల కఠిన కారాగారం.. మిగిలిన వారికి పాత్రను బట్టి శిక్షలు
- తొమ్మిది మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం

2

## టిమ్స్‌కు వెళ్లకుండా 'లాక్'!



4

- సనత్‌నగర్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపు
- హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ గృహ నిర్బంధం
- కోకాపేట్‌లో హరీశ్ నివాసం వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- ప్రారంభోత్సవంలో సీఎం వ్యాఖ్యలు అవాస్తవమన్న బీఆర్ఎస్ నేతలు
- వాస్తవాలు చెబుతామంటే అడ్డుకుంటున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం

## బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి



3

- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు

2

## కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

- అర్ధరాత్రి అగ్నికీలలు.. 9 మంది దుర్మరణం
- మృతుల్లో చిన్నారి.. అందరూ బంగ్లాదేశీయులే
- వైద్య చికిత్స కోసం వచ్చి మృత్యువాత

4





## బాలికల జీవితాలతో చెలగాటం..

# 33 మందికి శిక్ష

**వ్యభిచార రొంపిలోకి మైనర్లను దింపిన ముఠాపై నాంపల్లి పోక్సో కోర్టు కొరడా**

**ఐదుగురికి జీవిత ఖైదు.. మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు**

**14 మందికి పదేళ్ల కఠిన కారాగారం..**

**మిగిలిన వారికీ పాత్రను బట్టి శిక్షలు**

**9 మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం**

**హైదరాబాద్, ఆగస్టు 19:** మైనర్ బాలికలను ప్రలోభాలకు గురిచేసి వ్యభిచార రొంపిలోకి దింపిన ముఠాపై నాంపల్లి పోక్సో కోర్టు కొరడా ఝుళిపించింది. పదకొండేళ్ల క్రితం నమోదైన కేసులో 33 మందిని దోషులుగా నిర్ధారిస్తూ కీలక తీర్పు వెలువరించింది. నేర తీవ్రత, కేసులో దోషుల పాత్ర ఆధారంగా ఐదుగురికి జీవిత ఖైదు విధించగా, మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన దోషులకు సైతం వారి పాత్రను బట్టి శిక్షలు ఖరారు చేసినట్లు సమాచారం. 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం నాంపల్లి పోక్సో కోర్టు ఈ తీర్పును వెలువరించింది. తొమ్మిది మంది మైనర్ బాలికలను ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేసి వారిని వ్యభిచారంలోకి దింపినట్లు అభియోగాలు నమోదయ్యాయి. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు, ఆధారాలను న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించింది. సుదీర్ఘంగా సాగిన విచారణ అనంతరం నిందితుల్లో 33 మందిని దోషులుగా నిర్ధారించి శిక్షలను ఖరారు చేసింది.

### బాధిత బాలికలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం

దోషులకు కఠిన శిక్షలు విధించడంతో పాటు బాధిత బాలికలకు పరిహారం అందించాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో బాధితులైన తొమ్మిది మంది బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని స్పష్టం చేసింది. మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను ఛిద్రం చేసిన ముఠా సభ్యులకు భారీ శిక్షలు విధిస్తూ నాంపల్లి పోక్సో కోర్టు వెలువరించిన తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

# సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు

**513 మంది సిబ్బంది వివిధ విభాగాలకు బదిలీ**



**హైదరాబాద్, ఆగస్ట్ 19:** మారుతున్న సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ విభాగాలకు చెందిన 513 మంది సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. బదిలీ అయిన 513 మందిలో 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు ఉన్నారు. వీరితో పాటు 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు డీజీపీ తెలిపారు. ఈ బదిలీల్లో భాగంగా అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. కొత్త బాధ్యతలు చేపట్టే ముందు సిబ్బందిని రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటాచ్‌మెంట్ ద్వారా పనిచేయించనున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, సామర్థ్యం ఆధారంగా తుది బాధ్యతలను నిర్ణయించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

# బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

**నటి నిధి అగర్వాల్‌కు ఈడీ ప్రశ్నలు**



**హైదరాబాద్, ఆగస్ట్ 19:** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

# 22/ఏ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

- ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి
- పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
- అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 19:** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఏ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఏ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఏ భూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 22/ఏ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ది పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.



## ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

**ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి**

**ఖమ్మం, ఆగస్టు 19:** గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 12 మంది దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నాను. రూ. 61.76 కోట్లతో ప్లలెగూడెంలో సీసీ, బీటీ రోడ్ల తో పాటు వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెగూడెంలో ప్రభుత్వ మరియు అసైన్డ్ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షల నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సభలో పింఛన్లు కావాలని అడిగిన మహిళలకు నెల 31వ తేదీలోగా అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## కేంద్ర ప్రభుత్వానివి కుట్రపూరిత రాజకీయాలు

**ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓట్ల తొలగింపు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణ**

**ఖమ్మం, ఆగస్టు 19:** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ అనే ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎస్ఐఆర్ అనే భూతాన్ని చూపి భారీగా ఓట్ల తొలగింపుకు తెరలేపిందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఇన్చార్జి సచిన్ సావంత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ,పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

# కాంగ్రెస్‌లో 'కొండా' కలకలం!

**టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి స్వతంత్ర పోటీకి సిద్ధం**

**'సీఎం రేవంతా.. పొంగులేటా?' అంటూ సుష్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు**

**కొండా మురళికి ఇచ్చిన ఎమ్మెల్సీ హామీ ఏమైందని ప్రశ్న**

**రేవూరి ప్రకాశ్‌రెడ్డి టికెట్‌పై తీవ్ర అభ్యంతరం**

**సీఎం కుటుంబంపై అవినీతి ఆరోపణలు.. మరిన్ని బయటపెడతానని హెచ్చరిక**

**వ్యాఖ్యలను ఖండించిన మల్లు రవి.. చర్యలు తప్పవని స్పష్టీకరణ**



**వరంగల్, ఆగస్టు 19:** మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆమె ప్రకటించారు. అంతటితో ఆగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుబడుతూ.. "అసలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డా.. పొంగులేటి శ్రీనివాసరెడ్డా? ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు" అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం సృష్టించాయి. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన వైఖరిలో మార్పు వచ్చిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో తన తండ్రి కొండా మురళీ కీలకంగా సహకరించారని అన్నారు. ఆ సమయంలో కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు.

### 'మైసమ్మపై ప్రమాణం చేస్తారా?'

కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి చెప్పగలరా? అంటూ సుష్మితా పటేల్ సవాల్ విసిరారు. "హామీ ఇవ్వలేదని ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం "అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్" మధ్య పోటీ నడుస్తోందని వ్యాఖ్యానించారు. పరకాల నియోజకవర్గంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా ప్రశ్నించారు. దమ్ముంటే ఆయనతో రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. "మా ఇలాఖాకు వచ్చి మాతో ఎందుకు పెట్టుకుంటున్నారు?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ తనకు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. దీంతో పరకాల కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమైనట్టయ్యాయి. రేవంత్‌రెడ్డి సోదరుడికి సంబంధించిన రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే ఇప్పటివరకు బయటపెట్టానని సుష్మితా ఆరోపించారు. తనపై కౌంటర్‌కు దిగితే మరిన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో లేదో కూడా చెప్పలేమంటూ వ్యాఖ్యానించారు.

### సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

సుష్మితా పటేల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని ఖండించారు. పూర్తి వివరాలు తెప్పించుకుని పరిశీలించిన తర్వాత పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి కుమార్తెనే ముఖ్యమంత్రి, పార్టీ నాయకత్వంపై బహిరంగంగా తీవ్ర వ్యాఖ్యలు చేయడం, టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర పోటీకి దిగుతానని ప్రకటించడం కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ ప్రకంపనలకు దారితీసింది.

# గురువునే కడతేర్చిన టెన్త్ విద్యార్థులు!

- నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు
- పదో తరగతి చదివిన ఇద్దరు మైనర్లే నిందితులని పోలీసుల నిర్ధారణ
- ముందుగానే ఇంట్లోకి చొరబడి వంటగదిలో మాటు
- రూ.2 లక్షల నగదు కోసం దారుణ హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడి

గంజాయి, జల్సాలకు అలవాటుపడి ఘాతుకానికి తెగబడినట్లు పోలీసుల గుర్తింపు

**నల్లగొండ, ఆగస్టు 19:** చదువు చెప్పిన గురువుపైనే కత్తి దూశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 27 సార్లు పొడిచి ప్రాణాలు తీశారు. అనంతరం ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని సుమారు రూ.2 లక్షల నగదుతో పరారయ్యారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన విషయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘాతుకానికి పాల్పడింది ఆమె వద్ద చదువుకున్న పదో తరగతి విద్యార్థులేనని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 11న సాయంత్రం 6 గంటల సమయంలో రూపారెడ్డి హత్యకు గురయ్యారు. ఆమె పాఠశాల నుంచి ఇంటికి వచ్చే సమయాన్ని ముందుగానే గమనించిన నిందితులు పక్కా పథకం ప్రకారం ఇంట్లోకి చొరబడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రూపారెడ్డి ఇంటికి చేరుకునే ముందే గోడ దూకి లోపలికి ప్రవేశించిన ఇద్దరు మైనర్లు.. ఇంటి తాళం తీసి వంటగదిలో దాక్కున్నట్లు గుర్తించారు.

### ఇంట్లో మాటు.. వచ్చాక దాడి

పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన రూపారెడ్డి కొద్దిసేపటి తర్వాత పడకగదిలోకి వెళ్లారు. అప్పటికే వంటగదిలో మాటువేసిన నిందితులు వెనుక నుంచి వచ్చి ఆమెపై కత్తితో దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. తప్పించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఏకంగా 27 సార్లు పొడవడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హత్య అనంతరం రూపారెడ్డి హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేసిన నిందితులు అందులో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదును తీసుకుని పరారైనట్లు పోలీసులు తెలిపారు.

### గంజాయి.. జల్సాల కోసమేనా?

నిందితులైన మైనర్లు గంజాయికి, జల్సాలకు అలవాటుపడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. తమ అవసరాలకు డబ్బు కావడంతో రూపారెడ్డి వద్ద నగదు ఉంటుందని భావించి హత్యకు పథకం వేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్య తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి దోచుకున్న డబ్బుతో జల్సాలు



చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం.

### కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్తలు

హత్యకు ముందు నుంచే నిందితులు జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సీసీ కెమెరాలకు చిక్కకుండా కదలికలు సాగించడంతో తొలుత నిందితులను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వివిధ కోణాల్లో ఆధారాలను విశ్లేషించిన పోలీసులు చివరకు ఇద్దరు మైనర్లపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్యకు సంబంధించిన కీలక విషయాలు బయటపడినట్లు తెలిపారు. చదువు చెప్పి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ప్రిన్సిపల్‌నే డబ్బు కోసం ఆమె వద్ద చదువుకున్న విద్యార్థులు హత్య చేశారన్న విషయం కొండమల్లేపల్లిలో తీవ్ర దిగ్భ్రాంతి రేపుతోంది. మైనర్లు మత్తుకు, జల్సాలకు బానిసై ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డారన్న పోలీసుల దర్యాప్తు అంశాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

# టిమ్స్‌కు వెళ్లకుండా నేతల 'లాక్'!

- సనత్‌నగర్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపు
- హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ గృహ నిర్బంధం
- కోకాపేట్‌లో హరీశ్ నివాసం వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- ప్రారంభోత్సవంలో సీఎం వ్యాఖ్యలు అవాస్తవమన్న బీఆర్ఎస్ నేతలు
- వాస్తవాలు చెబుతామంటే అడ్డుకుంటున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం



**హైదరాబాద్, ఆగస్టు 19:** సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లను గృహ నిర్బంధం చేశారు. కోకాపేట్‌లోని హరీశ్‌రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతల కదలికలపైనా పోలీసులు ఆంక్షలు విధించినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. సనత్‌నగర్‌లో ఇటీవల ప్రారంభించిన టిమ్స్ ఆస్పత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పడంతో పాటు టిమ్స్ నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించాలన్న ఉద్దేశంతో సందర్శనకు పిలుపునిచ్చినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు ఆస్పత్రికి బయలుదేరకుండా పోలీసులు ఆయన నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి గృహ నిర్బంధం చేశారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కూడా ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు.

### 'మౌలిక వసతులు లేకుండానే ప్రారంభించారు'

సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో సమకూర్చకుండానే ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఆస్పత్రిని ప్రత్యక్షంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచేందుకే తాము వెళ్లాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

### 'వాస్తవాలు చెబుతామంటే నిర్బంధమా?'

తమను గృహ నిర్బంధం చేయడంపై తలసాని శ్రీనివాస్‌యాదవ్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నేతలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల్లోని అవాస్తవాలను ప్రజలకు వివరించేందుకు ఆస్పత్రిని సందర్శించాలనుకుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులను సైతం ఎందుకు గృహ నిర్బంధం చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ హయాంలోనే టిమ్స్‌కు శ్రీకారం

రాష్ట్రంలోని ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరం నలువైపులా టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2022 ఏప్రిల్ 26న సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల నాటికే ఆయా ఆస్పత్రుల నిర్మాణ పనులు గణనీయంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు.

# బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

## ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**హైదరాబాద్, ఆగస్టు 19:** తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో బుధవారం నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం ప్రభుత్వ వ్యయంతోనే ఈ భారీ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, విస్తృత స్థాయి ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన మార్కెట్లు మరియు వినూత్న నిధుల విధానాలు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ మరియు వ్యవసాయ రంగాలే ప్రధాన పునాది అని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి, రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలని, బ్యాంకింగ్ వ్యవస్థే నేరుగా రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందజేయాలని, దాంతో పాటు డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాలను కూడా అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని కోరారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రుణ వ్యూహాలు ఉండాలని, ఒకవేళ రైతు రుణం చెల్లించలేకపోతే రికవరీ చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా, అతని ఆదాయం ఎందుకు తగ్గిందో లోతుగా విశ్లేషించాలని బ్యాంకు ప్రతినిధులకు మార్గదర్శకత్వం చేశారు. జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి రూ. 52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగం పాత్రను పునరుద్ఘాటిస్తూ, రుణాల మంజూరుకు స్పష్టమైన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు. 'తెలంగాణ రైజింగ్-2047' రోడ్‌మ్యాప్‌లోని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతీయ నమూనాలకు అనుగుణంగా బ్యాంకులు ప్రత్యేక రుణ వ్యూహాలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 19.13 లక్షల జనధన్ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ, బిజినెస్ కరస్పాండెంట్లను క్రియాశీలం చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేందుకు 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సమయానికి అందేలా చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈవో దివ్య, నబార్డ్ సీజీఎం చిన్మయ్ కుమార్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ లైన్ దాటిన సుస్మిత

## సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు

## సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



**హైదరాబాద్,ఆగస్ట్19 :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకోవైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.



# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

## అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19:** లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు. అరుణాలచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.




# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృథా

## భూసేకరణలో బాధితులను పట్టించుకోరా

## కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఆగస్ట్ 19 :** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# ఇంటర్ బోర్డులో విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్, ఆగస్ట్ 19:** నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు జరిగాయి. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు కొనసాగిస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కుల్లో తప్పులు దొర్లడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు.

# సినిమా టికెట్లపై ప్రభుత్వం కీలక ఆదేశాలు

## థియేటర్ స్క్రీన్స్ ఆధారంగా రేట్లు

## ఐదు షోలకు అనుమతి..ఆదాయంలో కార్మికులకు వాటా




**హైదరాబాద్, ఆగస్ట్ 19:** తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది. చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హై బడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

# అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట

## ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం

**హైదరాబాద్, ఆగస్ట్ 19:** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు. అనామలీస్, నో- మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. క్లకెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. ంఃూఆఅ జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు ఫారం 6, 6ం, 7, 8పై ÷-లకెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

## సంపాదకీయం



# సవాళ్లను స్వీకరిస్తేనే ప్రజల ఆదరణ!

సవాళ్లను స్వీకరించకుండా..సమస్యలను పరిష్కరించకుండా ఎల్లకాలం పాలన సాగించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోతే ప్రజలు నిరంతరాయంగా ఓటేస్తారని అనుకోవడం కూడా పొరపాటే. ఈ దేశంలో మహామహులను ఓడించిన చరిత్ర ఉంది. భారతీయ జనతాపార్టీ కూడా ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది. ఇటీవల ఎర్రకోట మీదుగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించారు. దీనిపై ఎప్పుడో పార్లమెంట్ ఆమోదించినా, మళ్లీ ప్రధాని పదేపదే అదే విషయం ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడున్న 542 లోక్‌సభ సీట్లకు మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఒకే సమస్యలను పదేపదే ఎత్తి చూపడం ద్వారా ప్రజల్లో కూడా విసుగు తెప్పిస్తుంది. ఇకపోతే డీలిమిటేషన్ కూడా రాజకీయ లబ్ధికోసమే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో ఈ రెండు విషయాల్లో మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో గట్టెక్కించాలనుకున్న మోడీ ద్వయం వ్యూహం బెడిసి కొట్టిందనే చెప్పాలి.

ఈ క్రమంలో త్వరలోనే యూపి, పంజాబ్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకోసమేనా అన్నట్లుగా బిజెపి కూడా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించు కుంది. కొత్తగా కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం ద్వారా ముందుకు సాగాలని బిజెపి చూస్తోందనడానికి ఈ కూర్పు నిదర్శనంగా చూడాలి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. అయితే ఇది చెప్పుకోదగ్గ రీతిలో లేదు. ఎందుకంటే ప్రజలు ఆశిస్తున్నది ఇది కాదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి మార్పులు కావు. సమాజంలో వస్తున్న మార్పులపై స్పందించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత, విద్యార్థుల్లో ఆలోచనలు మారుతున్నాయి. జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న ఆలోచనలకు అనుగుణంగా బిజెపిలో మార్పు కనిపించడం లేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం గురించి చర్చించడం లేదని అనిపిస్తోంది. ఎందుకంటే యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో అనేకానేక సంస్కరణలు తీసుకుని వచ్చింది. మౌళికరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దేశంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. రోడ్డు, రైల్వే రంగాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఎన్నడూ ఊహించని విధంగా పురోభివృద్ధి కనిపిస్తోంది. అయితే విమానయానరంగం అందనంత ఎత్తులో ఉంది. తిరుపతికి వెళ్లాలంటే భయపడే స్థితలో విమాన టిక్కెట్ రేట్లు పెరిగాయి. విమయానయాన రంగాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇక అన్నింటికి మించి విద్యా,వైద్యరంగాలు నీరుగారి పోతున్నాయి. చదువుల, వైద్యం ప్రజలు భరించలేనంత భారంగా మారాయి. వీటిపై కేంద్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలి. అలాకాకుండా అభిజిత్ దీప్కేకు ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని వాదించడం సరికాదు. యువతలో వచ్చిన ఆందోళనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వారు ఏమి కోరుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నదన్నదే ముఖ్యం. కమలం పార్టీ బాగా విస్తరించిందని, తన కాళ్లమీద తాను నిలబడిందని, ప్రపంచంలో ఎవ్వరికీ లేని కార్యకర్తల బలం ఉందని విర్రవీగితే....ప్రజలు ఊదితే వచ్చే గాలిలో కొట్టుకు పోగలరు. పార్టీ వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ నిజానికి పటిష్టంగానే ఉందని ఒప్పుకోక తప్పదు. ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అయినా 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించింది. దీంతో ఎన్‌డిఎ బలంతో మళ్లీ పగ్గాలు చేపట్టింది. నిజానికి ఇదే ఓ హెచ్చరికగా బిజెపి తీసుకోవాలి. అలా కాకుండా ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల శక్తి పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. మద్దతు ఇస్తున్న పార్టీల్లో టిడిపి సైతం ఎదిరించే స్థితిలో లేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు కొంచెం దానినుంచి బయటకు వచ్చి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో మోడీ ద్వయం పెత్తనమే సాగుతోంది. ఇప్పుడు కొత్త కార్యవర్గ కూర్పులోనూ అదే కనిపిస్తోంది. అయితే ఇది చాలదని గుర్తించాలి. ప్రజలకు మంచి చేసుకోవడానికి ఇంకా మంచిపనులు అనేక చేయాలి. ధరలను అదుపు చేయడం మొదలు, నిరుద్యోగ యువతను ఉపాధి, ఉద్యోగాల బాట పట్టించడం ముఖ్యం.

# నీట్ లీక్‌పై సుప్రీం సీరియస్

- ఎన్‌టీఏలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిందే
- తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత వ్యవస్థ ఉండాలని స్పష్టీకరణ
- ప్రశ్నపత్రాల భద్రత, సైబర్ సెక్యూరిటీపై పూర్తి వివరాలు కోరిన ధర్మాసనం
- సంస్థాగత మార్పులపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
- ఎన్‌టీఏ సంస్కరణలను పర్యవేక్షిస్తామన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. జాతీయ పరీక్షల సంస్థలో తాత్కాలిక మార్పులతో సరిపెట్టకుండా శాశ్వత, సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన, పారదర్శకమైన వ్యవస్థ ఉండాల్సిందేనని పేర్కొంది. ఎన్‌టీఏలో ఇప్పటివరకు చేపట్టిన సంస్కరణలపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, ఎన్‌టీఏ సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం విచారించింది. పరీక్షల నిర్వహణలో పదేపదే సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఒక్కో ఘటన జరిగినప్పుడు ఒక్కో చర్య తీసుకోవడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడింది. సమస్య మూలాలను గుర్తించి వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలని సూచించింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్ష కేంద్రాలకు చేరేవరకు అనుసరిస్తున్న భద్రతా విధానం, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. నీట్ సహా కీలక ప్రవేశ పరీక్షల భద్రతను నిరంతరం పర్యవేక్షించే శాశ్వత వ్యవస్థ అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఎన్‌టీఏను సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంతో పాటు పరీక్షల నిర్వహణలో లోపాలకు అవకాశం లేకుండా నిర్మాణాత్మక మార్పులు చేపట్టాలని సూచించింది. పరీక్షల నిర్వహణలో జరిగే తప్పిదాల ప్రభావం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై పడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు విశ్వాసం కలిగించే విధంగా వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడింది. ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తాయని పేర్కొంటూ భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు అవసరమని స్పష్టం చేసింది. ఎన్‌టీఏలో చేపట్టే సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ప్రశ్నపత్రాల భద్రత నుంచి పరీక్షల నిర్వహణ వరకు ఎన్‌టీఏ వ్యవస్థలో సమూల మార్పులకు సుప్రీంకోర్టు ఆదేశాలు కీలకంగా మారనున్నాయి.

# మౌలిక రంగానికి రూ.13 వేల కోట్ల బూస్ట్

- ఐదు భారీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా
- నాలుగు రైల్వే ప్రాజెక్టులకు రూ.9,450 కోట్లు
- గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు రూ.2,229 కోట్లు
- బిహార్‌లో నాలుగు వరుసల రహదారికి రూ.3,591 కోట్లు
- రైల్వే రద్దీ తగ్గింపు.. సరుకు రవాణా సామర్థ్యం పెంపే లక్ష్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో రూ.9,450 కోట్ల విలువైన నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులతో పాటు బిహార్‌లో రూ.3,591 కోట్లతో చేపట్టనున్న నాలుగు వరుసల రహదారి ప్రాజెక్టు ఉంది. రైల్వే మార్గాల్లో పెరుగుతున్న రద్దీని తగ్గించడం, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, ప్రయాణికుల రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేయడం లక్ష్యంగా నాలుగు బహుళ మార్గాల ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. గూడూరు–గుమ్మిడిపుండి మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.2,229 కోట్లు కేటాయించారు. ఈ మార్గంలో అదనపు లైన్లు అందుబాటులోకి వస్తే రైళ్ల రాకపోకలకు మరింత వెసులుబాటు కలగడంతో పాటు సరుకు రవాణా వేగవంతం కానుంది. ఖరగ్‌పూర్–భద్రక్ నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.3,352 కోట్లు, భద్రక్–హరిదాస్‌పూర్ నాలుగో లైన్‌కు రూ.1,583 కోట్లు కేటాయించారు. కటక్–పారాదీప్ మధ్య మూడు, నాలుగో లైన్ల నిర్మాణానికి మరో రూ.2,286 కోట్లు వెచ్చించనున్నారు. ఈ నాలుగు రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే ఆయా మార్గాల్లో రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు అదనపు రైళ్లను నడిపేందుకు అవకాశం ఏర్పడనుంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలు, నౌకాశ్రయాలతో రైల్వే అనుసంధానం మరింత బలోపేతం కానుంది. మొత్తంగా సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా. బిహార్‌లో ముజఫర్‌పూర్–సీతామర్హి–సోన్‌బర్సా రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు రూ.3,591 కోట్ల ప్రాజెక్టుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే బిహార్‌లోని కీలక ప్రాంతాల మధ్య రహదారి అనుసంధానం మెరుగుపడటంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు ప్రయాణికులు, సరుకు రవాణాకు మరింత సౌలభ్యం కలగనుంది. రైల్వే, రహదారి రంగాలకు ఒకేసారి రూ.13 వేల కోట్లకు పైగా ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం ద్వారా దేశంలో మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం మరో ముందడుగు వేసింది.

## కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

### నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు

**లాహోర్, ఆగస్ట్ 19:** పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్‌ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హాఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హాఫీజ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హాఫీజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్‌ఈటీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

## ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

### ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19:** ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హామెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రతా ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

## కోల్‌కతా హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

### అర్ధరాత్రి అగ్నికీలలు.. 9 మంది దుర్మరణం

### మృతుల్లో చిన్నారి.. అందరూ బంగ్లాదేశీయులే

### వైద్య చికిత్స కోసం వచ్చి మృత్యువాత





**కోల్‌కతా:** కోల్‌కతాలో అర్ధరాత్రి అగ్నికీలలు మృత్యుఘంటికలు మోగించాయి. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో చిన్నారి సహా తొమ్మిది మంది దుర్మరణం పాలయ్యారు. మృతులంతా బంగ్లాదేశ్‌కు చెందిన వారేనని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. వైద్య చికిత్స కోసం కోల్‌కతాకు వచ్చిన వారు హోటల్‌లో బస చేస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో హోటల్ మూడో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిద్రలో ఉన్నవారు ప్రమాదాన్ని గుర్తించి బయటపడేలోపే దట్టమైన పొగ, అగ్నికీలలు హోటల్‌ను చుట్టుముట్టాయి. పలువురు లోపలే చిక్కుకుపోయారు. కొందరు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అయితే చిన్నారి సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మూడో అంతస్తులోని ఏసీ పేలడం వల్లే తొలుత మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. అగ్నిమాపక, పోలీసు అధికారులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో చెలరేగిన అగ్నికీలలు సమీపంలోని ఇళ్లవైపు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నాలుగు అగ్నిమాపక వాహనాలతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. హోటల్‌లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. దట్టమైన పొగ కారణంగా సహాయక చర్యలకు కొంత అంతరాయం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితమే పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో ఓ హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. తాజాగా కోల్‌కతాలో మరో హోటల్‌లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

చురకలు



# యాదాద్రిలో ఘనంగా గిరిప్రదక్షిణ

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు, ఆగస్టు 19:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం యాదగిరిగుట్టలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేకువజామున యాదాద్రి ఆలయ ముఖ మండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ఈవో భవాని శంకర్‌తో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. భక్తులతో కిక్కిరిసిన గిరిప్రదక్షిణ మార్గం స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన గిరిప్రదక్షిణలో యాదాద్రి, పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ గిరిప్రదక్షిణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గోవింద నామస్మరణలతో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. స్వామివారి జన్మ నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ చేయడం ద్వారా స్వామివారి అనుగ్రహం లభిస్తుందని విశ్వసించిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తులు గిరిప్రదక్షిణ పూర్తిచేసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు గిరిప్రదక్షిణకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ సిబ్బంది, అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా యాదాద్రిలో నిర్వహించిన గిరిప్రదక్షిణ భక్తుల ఆధ్యాత్మిక సందడితో వైభవంగా సాగింది. స్వామివారి నామస్మరణలతో గిరిప్రదక్షిణ మార్గం మార్మోగగా, భక్తులు భక్తిపారవశ్యంలో స్వామివారిని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కంధిగడ్డ తండలో వయోవృద్ధుల గ్రామ కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా మాలోత్ తేజావత్, కార్యదర్శిగా దేశ్యానాయక్ ఎన్నిక

**ఆలేరు, ఆగస్టు 19:** ఆలేరు మండలం కందిగడ్డ తండ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మాలోత్ బోరిలాల్ ఆధ్వర్యంలో బుధవారం వయోవృద్ధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మాలోత్ తేజావత్, కార్యదర్శిగా మాలోత్ దేశ్యానాయక్, కోశాధికారిగా మాలోత్ రంజిత్, గౌరవ సలహాదారుగా కేతావత్ నరసింహ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తేజావత్ సారమ్మ, మాలోత్ సుగుణమ్మ, భానోత్ సత్తెమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. వృద్ధుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, ఒగ్గు క్రిస్టోఫర్, మండల కమిటీ సభ్యులు వల్లాల మధుసూదన్, బంద్రు రాజమల్లయ్యతో పాటు పలువురు గ్రామస్థులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.



# అమరవీరుల త్యాగాలకు ఆలేరులో చిరస్మరణీయ గుర్తు

**ఆలేరు, ఆగస్టు 19:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటేలా ఆలేరు పట్టణంలో తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలేరు పట్టణంలోని అండర్‌పాస్ చౌరస్తా వద్ద బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ఉద్యమకారులు, ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోకుండా వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేయడంలో అమరవీరుల స్థూపాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఆలేరు పట్టణంలోని అండర్‌పాస్ చౌరస్తాకు తెలంగాణ అమరవీరుల చౌరస్తా గా నామకరణం చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిర్మించనున్న అమరవీరుల స్థూపం ఆలేరు పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని, తెలంగాణ ఉద్యమ చరిత్రకు ప్రతీకగా భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. స్థూపం నిర్మాణ పనులను బీర్ల ఫౌండేషన్ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. స్థూపం పూర్తయిన అనంతరం ఆలేరు పట్టణానికి వచ్చే ప్రతి ఒక్కరికీ తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరవీరుల త్యాగాలు గుర్తుకొచ్చేలా నిర్మాణాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. వారి కుటుంబాల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో ఆలేరు పట్టణ ప్రజల్లో హర్షం వ్యక్తమైంది. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలకు శాశ్వత గుర్తుగా ఈ స్థూపం నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.



# రహదారుల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి: మంత్రి కోమటిరెడ్డి

**సుల్తానాబాద్, ఆగస్టు 19:** రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో రూ.219.67 కోట్ల విలువైన HAM, నాన్‌ప్లాన్ రహదారి పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు.

గత పదేళ్లలో పెద్దపల్లి జిల్లాలో రూ.900 కోట్ల రహదారి పనులు మంజూరైతే, ప్రస్తుత ప్రభుత్వం రూ.1,700 కోట్ల పనులు మంజూరు చేసిందని తెలిపారు. పెద్దపల్లి బైపాస్‌ను ఏడాదిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, సుల్తానాబాద్ బైపాస్ మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రులు సూచించారు.

# కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- ఆలేరులో 250 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్ల పంపిణీ

**ఆలేరు, ఆగస్టు 19 :** కల్లుగీత కార్మికుల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. తాటి చెట్లు ఎక్కే సమయంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆలేరు పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గానికి చెందిన 250 మంది కల్లుగీత కార్మికులకు బీర్ల అయిలయ్య కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా కల్లుగీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తాటి చెట్లు ఎక్కే సమయంలో గీత కార్మికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున, అలాంటి ప్రమాదాలను నివారించడంతో పాటు వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల భద్రతతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆలేరు నియోజకవర్గంలో కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గీత కార్మికుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సేఫ్టీ కిట్లను నిర్లక్ష్యం చేయకుండా వాటిని సక్రమంగా వినియోగిస్తూ తాటి చెట్లు ఎక్కే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, గీత కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కల్లుగీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## కేకే కమిటీ ఏబీసీ కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలి

- ఉద్యమకారులకు న్యాయం చేస్తే మరో 10 ఏళ్లు కాంగ్రెస్ దే అధికారం.
- వెంటనే ప్రత్యేక వెబ్ సైట్ ఓపెన్ చేయాలి.
- సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు.

**వలిగొండ ఆగస్టు 19:**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఏ, బీ, సీ కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఉద్యమకారులను గుర్తిస్తే ప్రభుత్వంపై ఉద్యమకారుల్లో విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగితే ప్రభుత్వానికి అండగా నిలిచి మరో పది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకు ఉద్యమకారులు కృషి చేస్తారని క్రిస్టఫర్ అన్నారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత కోసం వెంటనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అర్థిక సహాయం అందజేత.



**వలిగొండ ఆగస్టు 19 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన దొడ్డి ఎంకమ్మ చాలా రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. వారి యొక్కకుటుంబ సభ్యులకి ఏజెఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రామ యువత పాల్గొన్నారు.

## ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




**వలిగొండ ఆగస్టు 19 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బుధవారం మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం గా ర్యాలీ నిర్వహించడం జరిగింది.కేంద్ర రాష్ట్ర పథకాలు ఏదైనా ఉన్న ప్రతి ఫోటోగ్రాఫర్ సభ్యునికి అందేలా చూడాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు బొమ్మగాని వెంకటేష్, మండల అధ్యక్షులు కొండూరు రమేష్ ఉపాధ్యక్షులు జువ్వగని సుమన్ కోశాధికారి బల్లెపు కృష్ణస్వామి ప్రధాన కార్యదర్శి ఆమనగంటి శ్రీరాములు సహాయ కార్యదర్శి మిర్యాల వెంకటేష్ ప్రచార కార్యదర్శి చిట్టబోయిన తిరుమలేష్ కార్యవర్గ సభ్యులు వేలిమినేటి రమేష్,బద్దం అయ్యప్ప, దంతూరి వెంకటేశం, ఫోటోగ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

## కేజీబీవీ అందోల్ లో బాలికల ఆరోగ్యం, భద్రతపై అవగాహన

**అందోల్, ఆగస్టు 19:** బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా




మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ అందోల్‌లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, బాలికల భద్రత, సైబర్ నేరాలు, సేఫ్ టచ్–అన్‌సేఫ్ టచ్, కెరీర్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యతో పాటు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహిస్తూ ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని అధికారులు సూచించారు. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, OTPలు పంచుకోవద్దని హెచ్చరించారు. రక్తహీనత నివారణకు ఐరన్‌తో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద 3,000 శానిటరీ ప్యాడ్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, సీడీపీఓ మాధులిక, ఎంఆర్‌వో మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లో విస్తృత పోలీసు తనిఖీలు

### 179 బైక్ లు, 5 ఆటోలు, ఒక కారు స్వాధీనం

**ఆదిలాబాద్, ఆగస్టు 19:** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని తిరుపల్లి, ఖిల్లా ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటల నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 179 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నంబర్ ప్లేట్లు కలిగిన రెండు ద్విచక్ర వాహనాలను గుర్తించి, BNS సెక్షన్ 318(4) ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎం. వెంకట నర్సయ్య, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలేరులో అమరవీరుల స్తూపానికి శంకుస్థాపన



**ఆలేరు, ఆగస్టు 19:** పట్టణంలోని అమరవీరుల చౌరస్తా (రైల్వే గేట్) వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత డా. చిలుకు స్వామి కార్యక్రమంలో పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలు చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు.
అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అమరవీరుల స్తూపం తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తుచేసే స్ఫూర్తి కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైతాంగ ఉద్యమ హామీలు అమలు చేయాలి



**ఆలేరు, ఆగస్టు 19:** ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేపట్టిన ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అ [illegible] ా జిల్లా అధ్యక్షుడు పద్మ సుదర్శన్ లు డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరులో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఏఐకేఎంఎస్ జిల్లా ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. రైతు వ్యతిరేక చట్టాల రద్దు, పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధర, విద్యుత్ బిల్లుల తదితర అంశాలపై కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మిక వ్యతిరేక చర్య అని వారు ఆరోపించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మామిడాల బాలమల్లేష్, ఇక్కిరి శ్రీనివాస్, చిరబోయిన కొమురయ్య, చిమ్మి అబ్బాయిలు తదితరులు పాల్గొన్నారు.

## దేవనూర్ గ్రామములో డ్వాక్రా భవన నిర్మాణానికి భూమి పూజ

### సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు



**యాలాల మండలం, ఆగస్టు,19:**
యాలాల మండలంలోని దేవనూర్ గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న డ్వాక్రా భవనానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు గ్రామంలోని మహిళా సంఘాల సభ్యుల కోసం ఈ భవనాన్ని నిర్మించనున్నారు. సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, పొదుపు కార్యకలాపాలు నిర్వహించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు.ఈ సందర్భంగా రేణుకాదేవి మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి డ్వాక్రా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడాలి. ఈ భవనం ద్వారా గ్రామ మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయి అని అన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, డ్వాక్రా సంఘ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త భవనం రావడంతో ఇకపై వర్షం, ఎండకు ఇబ్బంది లేకుండా సమావేశాలు నిర్వహించుకోవచ్చని మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

# నేడు తెలంగాణ అమరవీరుల స్తూపం శంకుస్థాపనకు ఏర్పాట్లు

- **చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**
- **తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మొద్దు.**
- **.తెలియని వ్యక్తులకు డబ్బులు, వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు.**
- **మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.**



**నారాయణపేట, ఆగస్టు,19:** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఒక ప్రకటనలో తెలిపారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా లోన్, తక్షణ ఉద్యోగం, లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు.ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు, ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు.అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, QR కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు. విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని, ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం, చిట్‌ఫండ్లు, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లను చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు.
ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట

# మెదక్ జిల్లాలో కోతుల బెడద నియంత్రణకు పటిష్ట చర్యలు

- **ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి**
- **కోతులను పట్టి నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్, ఆగస్టు 19:** జిల్లాలో కోతుల బెడదను నియంత్రించేందుకు స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణను వేగవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. రైతుల పంటలను కోతుల బారి నుంచి కాపాడేందుకు కృతనిశ్చయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఎఫ్‌వో జోజి, డీపీవో యాదయ్య, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లతో కోతుల బెడద నివారణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోతుల బెడద కారణంగా పంటలు ధ్వంసం కావడంతో పాటు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు సైతం కోతుల దాడుల్లో గాయపడిన ఘటనలు ఉన్నాయని, ఈ సమస్యపై ప్రజావాణిలో అనేక వినతులు అందాయని పేర్కొన్నారు. కోతులను పట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, స్థానిక అటవీ అధికారుల సహకారంతో వాటిని నిర్మల్ జిల్లాకు తరలించాలని సూచించారు. అక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా వాటి సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులు, ఇతర సహకారం కోసం ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యాన్ని పొందాలని సూచించారు. కోతుల బెడద నియంత్రణను ఉద్యమంలా చేపట్టి దశలవారీగా సమస్యను తగ్గించాలని, రైతుల పంటలకు రక్షణ కల్పించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జోజి, డీపీవో యాదయ్య, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 29,30,31 వరకు జరుగు సిపిఎం పాదయాత్ర

- **ఆగస్టు 31న చేలో ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయండి.**
- **ఎండి.జహంగీర్సి పిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు.**



**వలిగొండ ఆగస్టు 19 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకై డిమాండ్ చేస్తూ ఆగస్టు 29,30,31 తేదీల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని 29 న, భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న ఇందిరా పార్క్ కు చేరుకొని మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 31న జరిగే చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ మహాధర్నాను వేలాదిగా రైతులు,ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శిలు, ప్రజా సంఘాల మండల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం జరిగింది అనంతరం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి దశాబ్దం అవుతున్నప్పటికీ జిల్లాలో ఎంతవరకు ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పురోగతి సాధించ లేదన్నారు. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉండి లక్షలాది మంది చిన్న సన్నకారు మధ్యతరగతి రైతాంగం ఆధారపడి తమ కుటుంబాలను గడుపుతున్నారన్నారు. ఇక్కడి ప్రజలకు గత్యంతరం లేక విషాన్ని వెదజల్లుతున్న మూసీ పై ఆధారపడి అనేక రోగాలకు గురవుతున్నారని ప్రజల గోడును ప్రజల ఆరోగ్యాలను పట్టించుకునే పరిస్థితిలో లేని పాలకులు తమ చేతగానితనాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అరకొరకు నిధులు అత్తెసరు పనులతో కాలయాపన చేస్తూ ప్రచార ఆర్భాటాలు చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో సాగు తాగునీటికి ఎంతో కీలకమైన బస్వాపూర్ గంగమ్మల్ల,చర్లగూడెం, లాంటి బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిధుల కొరత వల్ల ఏళ్ల తరబడి పనులు పెండింగ్ లోనే ఉంటున్నాయని ఈ ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేస్తే జిల్లా ప్రజల సాగు తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని అదేవిధంగా బునాది గాని కాలువ ధర్మారెడ్డి పెల్లి కాలువలకు నిధుల విడుదలలో తీవ్రమైన జాప్యం వల్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని పాలకులు ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలన్నారు బస్వాపూర్ కాలేశ్వరం కాలువ ద్వారా గోదావరి జలాలను అందిస్తే ఈ ప్రాంతానికి మూసి విషం నుండి విముక్తి లభిస్తుందని పైల్వాన్ పురం పై నుండి వెళ్తున్న కాలేశ్వరం కెనాల్ కు తూము ఏర్పాటు చేయడం ద్వారా బునాది గాని చెరువు నిండడం ద్వారా వలిగొండ మండలం తో పాటు ఆత్మకూరు,మోత్కూరు, గుండాల,అడ్డగూడూరు మండలాల వరకు గోదావరి జలాలు అందుతాయన్నారు. మరోపక్క ధర్మారెడ్డి పెల్లి కత్వవద్ద నుండి వెళుతున్న కాలేశ్వరం కెనాల్ కు మరో తూమును ఏర్పాటు చేయడం ద్వారా సంగెం,వర్కట్పల్లి, గ్రామాల మీదుగా గోకారం రామసముద్రం చెరువు నింపడం ద్వారా రామన్నపేట,చిట్యాల మండలాలకు గోదావరి జిల్లాలు అందుతాయన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించాలంటే సిపిఎం నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలో రైతులు ప్రజలు రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశం కందడి సత్తిరెడ్డి అధ్యక్షతన జరగగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్, చీర్క శ్రీశైలం రెడ్డి,కర్ణకంటి యాదయ్య,దుబ్బ లింగం, భీమనబోయిన జంగయ్య, శాఖ కార్యదర్శిలు ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు దయ్యాల మల్లేశం,చేగూరి నగేష్, దొడ్డి బిక్షపతి,రాధారపు మల్లేశం, కర్నాటి మత్స్యరాణి, శీలం ఇందిర,కొండూరు సత్తయ్య, ఉంద్రాటి పాపయ్య,వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ సీ.హెచ్ ప్రియాంక.**




**నారాయణపేట, ఆగస్టు,19:**
బుద్వేల్–నాచారం (RR) రేడియల్ రోడ్డు– ప్రాజెక్టుకు సంబంధించి నారాయణపేట జిల్లాలోని కోస్గి మండలం నాచారం, తోగాపూర్ గ్రామాల పరిధిలో భూసేకరణ కోసం ఆయా గ్రామాల రైతులతో బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో వేర్వేరుగా జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం,పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేసేందుకు భూయజమానులు సహకరించాలని కోరారు. భూసేకరణ పరిహారం విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, సంబంధిత భూమికి ఉన్న ప్రాథమిక మార్కెట్ విలువ ఆధారంగానే పరిహారం నిర్ణయించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇతర జిల్లాల్లో అమలవుతున్న పరిహార రేట్లను నారాయణపేట జిల్లాతో నేరుగా పోల్చడం సరికాదని, ప్రతి ప్రాంతానికి సంబంధించిన ప్రాథమిక మార్కెట్ విలువ, భూసేకరణ నిబంధనల ఆధారంగా పరిహారం నిర్ణయించాల్సి ఉంటుందని వివరించారు.ప్రస్తుత మార్కెట్ విలువలో వచ్చిన మార్పులను కూడా నిబంధనల మేరకు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. భూసేకరణ చట్టం ప్రకారం అర్హత కలిగిన భూయజమానులకు మార్కెట్ విలువతో పాటు చట్టబద్ధమైన సొలాటియం, అదనపు పరిహారం తదితర ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు.భూయజమానులు అంగీకరిస్తే పరస్పర సమ్మతితో పరిహారం చెల్లింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అంగీకారం లేని సందర్భాల్లో చట్ట ప్రకారం జనరల్ అవార్డు ప్రక్రియను కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.
భూసేకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయడం ద్వారా రేడియల్ రోడ్డు ప్రాజెక్టు నిర్మాణ పనులను కూడా త్వరగా ప్రారంభించి పూర్తి చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. భూయజమానుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, నిబంధనలకు లోబడి సాధ్యమైనంత త్వరగా పరిహారం అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.భూయజమానులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, జిల్లా అభివృద్ధితో పాటు రేడియల్ రోడ్డు ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఆర్డీవో రమేష్, కోస్గి తహసీల్దార్ కళ్యాణి, భూసేకరణ విభాగం డీటీలు, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు..

- జీవో నెం 97ను వెంటనే రద్దు చేయాలి..
- మహబూబ్ నగర్-తాండూరు ప్రధాన రహదారిపై ధర్నా..




**కోస్గి మున్సిపల్, ఆగస్టు,19:** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖ లో విలీనం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బుధవారం కోస్గి శివాజీ చౌరస్తాలోని మహబూబ్ నగర్–తాండూరు ప్రధాన రహదారిపై విద్యార్థులతో కలిసి ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో 70 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ కళాశాలలను తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి సంబంధించిన జీవో నెం 97 శక్తి స్కీమ్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా తెలంగాణ సాంకేతిక విద్య శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని అన్నారు. పాలిటెక్నిక్ విద్య కేవలం నైపుణ్య శిక్షణకు పరిమితమైనది కాదని, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను తయారు చేసే ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థ అని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందించడంలో పాలిటెక్నిక్ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.అదే విధంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్యను కొనసాగించేందుకు బి టెక్ లాటరల్ ఎంట్రీ అవకాశాలను యథావిధిగా కొనసాగించి, మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలల్లో ఆధునిక ల్యాబ్‌లు, నూతన పరికరాలు, మెరుగైన మౌలిక వసతులు, తగినంత బోధనా సిబ్బంది, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.విద్యార్థులు, అధ్యాపకులు, సాంకేతిక విద్యా నిపుణులతో విస్తృతంగా చర్చించకుండా కీలక నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఏబీవీపీ నాయకులు స్పష్టం చేశారు.పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని, జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులు శ్రీను, జగన్,రాము,కార్తిక్, శివప్రసాద్,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోమిన్‌పేట్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS









**మొమిన్ పేట్ మండలం, ఆగస్టు,19:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS బుధవారం మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని మోమిన్‌పేట్, మార్పల్లి, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ల శాంతిభద్రతలు, నేర పరిస్థితులు, తీవ్రమైన నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసులు, పోలీస్ రికార్డులు, CCTNS నమోదు, NBWలు, సమన్లు, గన్ లైసెన్సులు, CCTV కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను సమీక్షించారు.

పోలీస్ రికార్డులు, కేసు ఫైళ్ల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎస్పీ, తీవ్రమైన నేరాల కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు సంబంధిత కేసులను నిరంతరం సమీక్షిస్తూ NBWలు, సమన్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.సైబర్ నేరాల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలని, CCTNSలో కేసులకు సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయడంతో పాటు రికార్డుల ఆన్‌లైన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామాలు, ప్రధాన రహదారులు, Entry–Exit ప్రాంతాల్లో CCTV నిఘాను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

మోమిన్‌పేట్ సర్కిల్ పరిధిలో CCTV కెమెరాల ఏర్పాటులో సాధించిన పురోగతిని ఎస్పీ అభినందించారు.అదే విధంగా పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ మరియు కార్యాలయ వాతావరణం పట్ల సంతృప్తి, ఆనందం వ్యక్తం చేశారు.ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీసింగ్ సేవలు అందించడంతో పాటు, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు మరియు ప్రజా భద్రతలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ అధికారులకు సూచించారు.ఇట్టి కార్యక్రమం లో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య,మోమిన్ పేట్ సీఐ వెంకట్, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# విద్యపై ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి: మంత్రి వివేక్



**మంచిర్యాల, ఆగస్టు 19:** విద్యారంగంపై ప్రభుత్వం చేసే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి అని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, ఉపాధి అవకాశాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోటపల్లిలో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షల CSR నిధులతో చేపట్టనున్న మరుగుదొడ్లు, స్నానపు గదులు, మరమ్మతు పనులకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో 2,500 మంది విద్యార్థులకు ఉపయోగపడే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించనున్నట్లు చెప్పారు. చెన్నూర్‌లో కాకా వెంకటస్వామి ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. పోటీ పరీక్షలతో పాటు విదేశీ ఉపాధి అవకాశాల కోసం జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తును ప్రారంభించారు. మందమర్రిలో కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి.




**నారాయణపేట (మం) ఆగస్టు,19:** నారాయణపేట రూరల్: మన ఊరు – మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా నారాయణపేట మండలంలోని అభంగాపూర్ గ్రామంలో ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి అవగాహన కల్పించారు. ప్రజలకు పోలీస్ శాఖతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా, గ్రామాల్లో శాంతిభద్రతలు, చట్టపరమైన అంశాలు, ప్రజల భద్రతకు సంబంధించిన సమాచారాన్ని చేరవేయడంలో పోలీస్ వాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, బ్యాంకింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ OTP, PIN, CVV, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడం,

ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, గ్రామ ప్రవేశ–నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 19:** జిల్లాలో భూముల రీసర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తికాగా, మరో పది గ్రామాల్లో కొనసాగుతోందని తెలిపారు. సర్వేకు ముందు సంబంధిత భూముల వివరాలను గ్రామస్తులకు తెలియజేయాలని, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు.

## ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్స్ అందజేత..




**కోస్గి మండలం,ఆగస్టు19:** కోస్గి:ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హనుమన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్స్ అందించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంద్రు నర్సిములు మాట్లాడుతూ ప్రపంచ ఫోటో దినోత్సవం సందర్భంగా బుధవారం కోస్గి పట్టణంలోని శివ సాయి ఫోటో స్టూడియో యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఫోటోగ్రఫీ అనేది కేవలం వ్యాపార దృక్పథంతో కూడినది కాదని అద్భుతమైన చిత్రాలను బంధించి భావితరాలకు అందించే కళ అని అన్నారు.అపురూపమైన చిత్రాలను తమ కెమెరాలో నిక్షిప్తం చేసే ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కోస్గి మహిళా సమైక్య అధ్యక్షురాలు అంజమ్మ, ఫోటోగ్రాఫర్స్ హనుమంతు యాదవ్,శ్రీకాంత్, బండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## DDACల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్, ఆగస్టు 19:** కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని National Action Plan for Drug Demand Reduction (NAPDDR) పథకం కింద 2026–27 ఆర్థిక సంవత్సరానికి GAP జిల్లాల్లో District De-Addiction Centres (DDAC) ఏర్పాటు, నిర్వహణకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థలు/NGOల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి డి. సౌందర్య తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో అర్హత కలిగిన NGOలు, స్వచ్ఛంద సంస్థలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన e-Anudaan పోర్టల్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, నిజామాబాద్ కార్యాలయాన్ని పని వేళల్లో నేరుగా లేదా 08462–251690 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

**ములుగు, ఆగస్టు 19:** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR–2026)లో భాగంగా 01–10–2026 అర్హత తేదీగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ERO కె. కృష్ణవేణి బుధవారం సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రతులను వారికి అందజేసి, క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. 109–ములుగు (ST) నియోజకవర్గంలో 11,308 మంది అన్‌మ్యాప్డ్ ఓటర్లు, 30,465 అనామలీస్ కలిపి మొత్తం 41,773 కేసులు గుర్తించినట్లు తెలిపారు. వీటిని పరిశీలించి ధృవీకరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫారం–6, 7, 8 ద్వారా కొత్త నమోదు, తొలగింపు, వివరాల సవరణ చేసుకోవచ్చని వివరించారు.

## వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి



**ములుగు, ఆగస్టు 19:** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రెండు నెలల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పప్పుధాన్యాలు, పండ్ల తోటలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి సూచించారు. మల్లంపల్లిలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్రస్థాయి కార్యక్రమంలో రైతుల పంటలను పరిశీలించి, మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్, బిందు–తుంపర సేద్యం తదితర పద్ధతులు, ఉద్యానశాఖ సబ్సిడీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ విశ్వతేజ, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, ఉద్యానవన అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## అప్పాయిపల్లి లో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



**కొడంగల్ మండలం,ఆగస్టు,19:** కొడంగల్ మండలం లోని అప్పాయి పల్లి గ్రామములో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, కొడంగల్ మున్సిపాలిటీ చైర్మన్ నందారం ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, బాల్ రెడ్డి ,ఆనంద్ రెడ్డి ,పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ పకీరప్ప వార్డ్ మెంబర్ లు శ్యామా గోకుల్ సింగ్ బందయ్య గౌడ్ రాములు దీపక్ సింగ్ రాంజీ నాయక్ గ్రామ సంగప్ప నాయకులు దత్తు సింగ్ కాశయ్య గౌడ్ బాలరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన 150 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**ఆదిలాబాద్, ఆగస్టు 19:** ఇంద్రవెల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 150 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై ఈ. సాయన్న సిబ్బందితో కలిసి ఓ కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించి మూడు గోనె సంచుల్లో ఉన్న బియ్యాన్ని గుర్తించారు. పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించి ★చింతవార్ సంతోష్ (49)★పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పేదలకు ప్రభుత్వం అందించే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు, నిల్వ, రవాణా లేదా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. ప్రసాద్ హెచ్చరించారు.

## డబుల్ రిజిస్ట్రేషన్‌తో భూ మోసం.. నలుగురిపై కేసులు




**ఆదిలాబాద్, ఆగస్టు 19:** మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టిసవర్గాం గ్రామంలో ఒకే ప్లాట్‌ను రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేసి మోసానికి పాల్పడిన రెండు ఘటనల్లో నలుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్లాట్ నంబర్ 66కు సంబంధించిన కేసులో యెల్పెద్ది నర్సారెడ్డి, యెల్మవార్ వెంకట్ రెడ్డి, తడ్సేన వెంకట్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. మరో ప్లాట్‌కు సంబంధించిన మోసం కేసులో నల్ల గణపతి రెడ్డిపై కేసు నమోదు చేశారు. భూముల కొనుగోలు సమయంలో రిజిస్ట్రేషన్ పత్రాలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, రెవెన్యూ రికార్డులను పూర్తిగా పరిశీలించాలని మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్ సూచించారు. రెండు కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## అటవీ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, ఆగస్టు 19::** జిల్లాలోని అటవీ భూముల పరిరక్షణకు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం జిల్లా అటవీ అధికారి నీరజ్‌తో కలిసి అటవీ భూములపై సమీక్ష నిర్వహించారు. అటవీ భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి స్థితిగతులపై స్పష్టమైన వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆక్రమణలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో పాటు పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అటవీ, రెవెన్యూ, గిరిజన శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

## రైతుల ఆదాయం పెంచేందుకు ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి

### ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**మహబూబ్‌నగర్, ఆగస్టు 19::**
తుల ఆదాయం పెంచడంతో పాటు నీటి వనరులు, భూసారాన్ని పరిరక్షించేందుకు తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే ఉద్యాన, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. భూత్పూర్ మండలం శేరిపల్లిలో ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ పాల్గొన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, డ్రిప్, మల్చింగ్ తదితర సదుపాయాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టాలని కలెక్టర్ కోరగా, వ్యవసాయంతో పాటు పాడి, చేపలు, తేనెటీగల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందాలని జితేష్ పాటిల్ సూచించారు. అనంతరం అధికారులు శేరిపల్లిలోని కాకరకాయ, చిక్కుడుకాయ తోటలను పరిశీలించారు.

## రూ.9,450 కోట్ల రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.9,450 కోట్లతో నాలుగు రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 410 కి.మీ. రైల్వే నెట్‌వర్క్ విస్తరించనుంది. ఇందులో గుమ్మిడిపూండి–గూడూరు మధ్య 90 కి.మీ. 3వ, 4వ లైన్ల నిర్మాణం కూడా ఉంది. ప్రాజెక్టులను 2030–31 నాటికి పూర్తి చేయనున్నారు. వీటితో రైలు రద్దీ తగ్గి ప్రయాణికులు, సరకు రవాణా సామర్థ్యం పెరగనుంది.

## ఘనంగా మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు

- మార్కండేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించిన చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్/కొత్తవాడ, ఆగస్టు 19 : :** అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ కొత్తవాడ 23వ డివిజన్‌లోని శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలి కులదైవమైన శ్రీ మార్కండేయ స్వామి సన్నిధిలో కొండా సురేఖ పేరిట అర్చన, అభిషేక కార్యక్రమాలను ఆలయ అర్చకులు క్యాతం శివకుమార్ శాస్త్రి చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం ఆమె ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, రాజకీయ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు నేత మాట్లాడుతూ కొండా సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఆమెకు భక్త మార్కండేయ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, బొల్లు సతీష్, దేవర రాము, దొంతుల ఉమ, కళ్లపెల్లి వాణి, ములుక సరిత, కందకట్ల విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, వెల్డి రేవతి, మోతుకూరి సావిత్రి, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పరిగి సబ్ జైలును సందర్శించిన IPS

### వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,



**పరిగి,ఆగస్టు,19:**
వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఈరోజు పరిగి సబ్ జైలును సందర్శించి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు.సబ్ జైలులోని భద్రతా ఏర్పాట్లు, ఖైదీల భద్రత, ప్రవేశ–నిష్క్రమణ మార్గాలు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జైలులోకి అనధికారిక వస్తువులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.అదేవిధంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు పోలీస్, జైలు సిబ్బంది సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టే విధంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జైలు అధికారులు భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధులు, అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలపై జిల్లా ఎస్పీకి వివరాలు అందించారు.ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా , IPS, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ డిఎస్పి వీరేష్, పరిగి సిఐ కొండల్ రెడ్డి, పరిగి సబ్ జైల్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, పరిగి ఎస్సై మోహన కృష్ణ ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది.

## ఇందిరమ్మ ఇళ్ల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కె. హైమావతి




**సిద్దిపేట ఆగస్టు19:** రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గెజిటెడ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అత్యంత కీలకమని కలెక్టర్ తెలిపారు. మండలాల వారీగా గెజిటెడ్ అధికారులకు కేటాయించిన గ్రామాల్లో లబ్ధిదారుల ప్రస్తుత ఇంటి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను సంబంధిత లాగిన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే సంబంధిత ఎంపీడీవోలు అర్హుల వివరాలను మంజూరు కోసం కలెక్టరేట్‌కు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

## విగ్రహం తొలగింపుపై ప్రజాగ్రహం.. సంపూర్ణ బంద్‌తో నిరసన

- పెద్దిని గుండెల్లో పెట్టుకున్న ప్రజలు... నర్సంపేట బంద్ ప్రశాంతం
- బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించిన వాణిజ్య, విద్యా సంస్థలు
- భారీ ర్యాలీతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు



**నర్సంపేట, ఆగస్టు 19 : :** తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నర్సంపేట నియోజకవర్గ బంద్ సంపూర్ణంగా విజయవంతమైందని పార్టీ నాయకులు తెలిపారు. బంద్‌కు నియోజకవర్గంలోని వివిధ వాణిజ్య వర్గాలు, విద్యాసంస్థలు, ఆర్టీసీ సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి విగ్రహం తొలగింపుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఉండటాన్ని ప్రభుత్వం జీర్ణించుకోలేకనే పోలీసుల ద్వారా తొలగించిందని విమర్శించారు. అధికార అహంతో విగ్రహాన్ని తొలగించగలరేమో కానీ, నర్సంపేట ప్రజల హృదయాల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డిపై ఉన్న ఆత్మీయతను మాత్రం చెరిపివేయలేరన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ ప్రజా పాలన అని చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన తప్పును సరిదిద్దుకొని పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహం తొలగింపును తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. బంద్‌కు సహకరించిన నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల నిర్బంధాలు, అరెస్టులను ఎదుర్కొంటూ బంద్‌ను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, జెడ్పీ వైస్ చైర్మన్, మాజీ ఒడిసిఎంఎస్ చైర్మన్, నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, నియోజకవర్గ క్లస్టర్ బాధ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, మహిళా, యువజన నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తే అరెస్ట్.. నిరసిస్తే నిర్బంధం.. ఇదేనా ప్రజాస్వామ్యం?

- బీఆరెస్ నాయకుల నిర్బంధం...కాంగ్రెస్ పతనానికి నాంది... తక్కళ్లపల్లి రవీందర్ రావు
- నర్సంపేట బంద్ విజయవంతం..విగ్రహ పునఃప్రతిష్ఠ కోసం పోరాటం కొనసాగిస్తామన్న బీఆర్ఎస్




**నర్సంపేట, ఆగస్టు 19 : :** తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. నర్సంపేట అభివృద్ధికి విశేష కృషి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం అన్యాయమని పేర్కొంది. విగ్రహం తొలగింపు చర్యను ప్రశ్నించేందుకు వస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు చేయడం, ప్రజాప్రతినిధులను గృహ నిర్బంధంలో ఉంచడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ నర్సంపేట డివిజన్ కోఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు ఆరోపించారు. నర్సంపేట బంద్‌కు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును జనగామలో అడ్డుకుని అరెస్టు చేయడం, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను వరంగల్‌లో హౌస్ అరెస్ట్ చేయడం, ఇతర నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఒక దివంగత ప్రజా నాయకుడి విగ్రహాన్ని తొలగించేందుకు భారీగా పోలీసు బలగాలను మోహరించడం ఎందుకని ప్రశ్నించారు. ప్రజల మద్దతు ఉందని భావిస్తే ప్రజల మధ్యకు వచ్చి సమాధానం చెప్పాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజ్, రహదారులు, సాగునీటి తదితర అభివృద్ధి కార్యక్రమాల కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన కృషిని ప్రజలు మరచిపోలేదని తెలిపారు. విగ్రహాన్ని తొలగించగలరు కానీ, నర్సంపేట ప్రజల గుండెల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉన్న స్థానాన్ని చెరిపివేయలేరని రవీందర్‌రావు పేర్కొన్నారు. అరెస్టులు, నిర్బంధాలు, కేసులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పిలుపుతో నర్సంపేట నియోజకవర్గంలో నిర్వహించిన సంపూర్ణ బంద్‌కు ప్రజలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు, ఆటో, ఆర్టీసీ సిబ్బంది స్వచ్ఛందంగా సహకరించారని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే తిరిగి విగ్రహాన్ని ప్రతిష్ఠించే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని రవీందర్‌రావు తెలిపారు. తదుపరి కార్యాచరణను పార్టీ నాయకత్వంతో చర్చించి ప్రకటిస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, ప్రజల తీర్పే అంతిమ తీర్పని తేల్చి చెప్పారు.

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత...

- **దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వర్ధన్నపేట/వరంగల్, ఆగస్టు 19 : :** దేవాలయాల అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతతను పొందాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని 65వ డివిజన్ కోమటిపల్లి గ్రామం మధుర నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కూర్మచల అష్టలక్షి సమేత నవనారసింహ వారాహి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు, అర్చకులు శ్రీమాన్ సేవాపతి రంగాచార్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. దైవ చింతనతో మనసుకు ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణం, అభివృద్ధికి నిరంతరం సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరిస్తూ సన్మార్గంలో నడవాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకునేలా అద్భుతమైన ఆలయాన్ని నిర్మించిన ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సునీల్, హసన్‌పర్తి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుపతి, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, డివిజన్ నాయకులు కుమార్, లింగు, విజయ్, ఆలయ కమిటీ సభ్యులు రమణ, హరీష్, కిషోర్, విజయ్, తిరుపతి, కుమార్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 22-A అభ్యంతరాలపై రోజువారీ సమీక్ష చేయాలి

**కలెక్టర్ డా. ప్రియాంక అలా**

**హైదరాబాద్, ఆగస్టు 19:**

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా బుధవారం ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తనిఖీ చేసి, 22-A జాబితాలోని భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయ, విక్రయదారులతో మాట్లాడి సమస్యలు, జాప్యాలపై ఆరా తీశారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 22-A అభ్యంతరాలను ప్రతిరోజూ సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం...

- **బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది.. 2028 ఎన్నికల్లో అధికారమే లక్ష్యం... డా.ఈడ శేషగిరిరావు**



**హనుమకొండ, ఆగస్టు 19 : :** బహుజనులు రాజకీయ కూలీలు కాదని, ఆధార్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది డా. ఈడ శేషగిరిరావు అన్నారు. బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని నేచర్ 369 హోటల్‌లో నిర్వహించిన అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఆధార్) పార్టీ రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆధార్ పార్టీ పనిచేస్తోందన్నారు. పార్టీని ప్రజలు ఆదరించి బలోపేతం చేయాలని కోరారు. వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించడంతో పాటు మరింత అభివృద్ధిని సాధించగలరని శేషగిరిరావు అన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బీసీ వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే ఆధార్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలనే ఆసక్తి, సామాజిక సేవా దృక్పథం కలిగిన యువతకు పార్టీలో విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఆధార్ పార్టీ పోటీ చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో ఆధార్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గట్ల యుగేందర్ గౌడ్, ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ చైర్మన్ ఆంబోజు బుద్దయ్య, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బండా రాజారాం, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మధు, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు నీరటి సత్యం, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షులు జెట్టి శ్రీనివాస్, పరకాల అసెంబ్లీ ఇన్‌చార్జి మల్లేష్, కొత్తగూడెం ఇన్‌చార్జి ప్రేమ్ దయిల్, ఖమ్మం ఇన్‌చార్జి బూర సైదారావు, ఖమ్మం పట్టణ అధ్యక్షులు నక్క అజయ్ పద్మశాలి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గంగుల రాజేందర్ ప్రసాద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మధు వర్మ నాయక్, రాష్ట్ర నాయకులు తల్లాడ వెంకన్న, మంద హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం జిల్లా నాయకులు సునీల్, నాగరాజు, మొగిలయ్య, రవీంద్ర, శ్రీకాంత్, వరంగల్ జిల్లా నాయకులు అఖిల్, శ్రవణ్, సాగర్, రంజిత్, రాకేష్, శ్యామ్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్, మొగిలయ్య ఫౌండేషన్ కార్యదర్శి కూనూరు రంజిత్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు మార్క రవి గౌడ్, కంకేటి సాగర్, కూనూరు రాకేష్, కామగోని శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# సెంటిమెంట్ రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టలేరు

- **మాజీ ఎమ్మెల్యేలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి... రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు**
- **శంకుస్థాపనల దగ్గర ఆగిన పనులు.. కాంగ్రెస్ చేతుల్లో పూర్తి**
- **పరకాలలో xరూ.484 కోట్లకు పైగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్నాం**



**హనుమకొండ, ఆగస్టు 19 : :**

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్ ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకొని వాస్తవాలను అంగీకరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు సెంటిమెంట్ రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతిరోజూ తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి అసంపూర్తిగా వదిలేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం నేరమా అని ప్రశ్నించారు. పరకాల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి దాదాపు రూ.35 కోట్ల వ్యయం అవుతుండగా, గత ప్రభుత్వం కేవలం రూ.6.19 కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. దీంతో సుమారు 16 నెలల పాటు పనులు నిలిచిపోయాయని, అనంతరం ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మిగిలిన నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభించామని వివరించారు. పరకాల నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే శంకుస్థాపన చేసి ప్రారంభించిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరకాల నియోజకవర్గంలో రూ.484 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు మంజూరు సాధించి అమలు చేస్తున్నామని వెల్లడించారు. పరకాల పట్టణానికి శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని, రాష్ట్రంలోనే తొలిసారిగా పరకాలలో మహిళా డైరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్‌ను అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఆయన పేరు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. జయశంకర్ స్వగ్రామమైన అక్కంపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించిన ఆయన, సీఎంఆర్ఎఫ్ నిధుల విషయంలో కూడా మాజీ ఎమ్మెల్యేపై విమర్శలు చేశారు. కౌకొండ గుట్టల ప్రాంతంలో చిన్న రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి, ప్రజాధనంతో రహదారులు నిర్మించిన అనంతరం అదే భూములను అధిక ధరలకు విక్రయించారనే ఆరోపణలను రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యేలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని వారు అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఇకనైనా తప్పుడు ఆరోపణలు మానుకొని నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు.

## సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి




**వరంగల్ ఆగస్టు19:** "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది పాల్గొన్నారు. డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి, రిమోట్ యాక్సెస్ యాప్, KYC మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. OTP, PIN, CVV, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## ప్రజల్లో నమ్మకం పెంచేలా పోలీసింగ్ ఉండాలి: ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, ఆగస్టు 19:** సిరికొండ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, వాహనాలు, సిబ్బంది విధుల పట్టిక, రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మండలంలో గంజాయి, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఓపెన్ డ్రింకింగ్‌ను నియంత్రించడంతో పాటు సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ఫేక్ నంబర్ ప్లేట్లపై నిఘా ఉంచాలని సూచించారు.

ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ అధికారిని కేటాయించి సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పెండెన్సీ లేకుండా చూడాలని, రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. తనిఖీలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, ఎస్సై బి. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఎల్‌ఓసి అందజేత



**వలిగొండ ఆగస్టు 19 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్ళగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మస్కు బుచ్చయ్య కుమారునికి వారం రోజుల క్రితం నిమ్స్ హాస్పిటల్ హైద్రాబాద్ లో సర్జరీ అయినది కావున, సహృదయనేత మన ప్రియతమ నాయకులు భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ వో సి చెక్ ఇవ్వడం జరిగింది. మస్కు బుచ్చయ్య కుటుంబ సభ్యులు మన ఎమ్మెల్యే కి ధన్యావాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం , మాజీ ఎంపీటీసీ ఉద్దగిరీ భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దగిరి శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ విద్యార్థుల 'గిన్నీస్ రికార్డ్ '

### అభినందించిన ఎమ్మెల్యే హరీష్ రావు

**సమయం న్యూస్ గజ్వేల్ ఆగస్టు 19** గజ్వేల్‌కు చెందిన కరాటే విద్యార్థులు గిన్నీ స్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కరాటే కార్యక్రమంలో పాల్గొని ఈ అరుదైన ఘనతను సాధించారు. కరాటే మాస్టర్ కృష్ణ శిక్షణలో సాధన చేసిన ఈ క్రీడాకారులు 30 నిమిషాల పాటు నిరంతరంగా కటా ప్రదర్శన చేశారు. విద్యార్థులు అక్షిత, భావిజ్ఞ, రిషిక, రామకృష్ణ, రఘురామ్, రామ్‌చరణ్, తరుణ్య, మైత్రి, తనూజ్, మనోజ్, అనన్య సింగ్, దేవాన్ష్ సింగ్, అఖిలేశ్వర్, ఎం.డి. ముస్తఫా, శ్రావణి, శరణ్య, హర్షవర్ధన్, శ్రీహరిణి, లక్ష్మీనరసింహ తో పాటు 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు, అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలలో నిరంతర సాధన పట్టుదల సమిష్టి కృషి ఎంతో అవసరమని అన్నారు చిన్న వయసు లో కరాటే లో శిక్షణ పొందుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వామ్యులు కావడం గర్వకారణం అని అన్నారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కళ్యాణ్ కార్ నర్సింగరావు, 20వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాస్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు



# వైద్య చరిత్రలో అరుదైన విస్మయం

## డాక్టర్ లక్ష్మీనాథ్ నేతృత్వంలో సంక్లిష్ట మెదడు శస్త్రచికిత్స విజయవంతం

## సోమాలియా శిశువుకు 'కేర్'లో పునర్జన్మ

## ప్రాణదాత డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు అపూర్వ శస్త్రచికిత్సా వైభవం

ప్రాణాలపై ఆశలు సన్నగిల్లిన తొమ్మిది నెలల పసికందు.. మెదడులో అరుదైన కణితి.. దానికి తోడు మెదడులో ద్రవం విపరీతంగా పేరుకుపోయిన అత్యంత క్లిష్ట పరిస్థితి. ఒకటి కాదు.. ఒకేసారి రెండు సంక్లిష్ట సమస్యలు. ఏమాత్రం తేడా జరిగినా ప్రాణానికే ప్రమాదం. అలాంటి పరిస్థితిలో హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రి వైద్యులు సాహసోపేతమైన శస్త్రచికిత్స నిర్వహించి సోమాలియాకు చెందిన చిన్నారి షఫీ మహమ్మద్ హుస్సేన్‌కు కొత్త జీవితం ప్రసాదించారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని వైద్య బృందం ఒకే విడతలో రెండు కీలక ప్రక్రియలను విజయవంతంగా పూర్తిచేసింది. తొమ్మిది నెలల షఫీ మహమ్మద్ హుస్సేన్ కొంతకాలంగా మందకొడిగా మారడం, పిలిచినా సరిగా స్పందించకపోవడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స చేసినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. హైటెక్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో చిన్నారిని పరీక్షించిన వైద్యులు అత్యాధునిక పరీక్షలు నిర్వహించారు.

### మెదడుపై పెరిగిన ఒత్తిడి

ఎంఆర్ఐ పరీక్షల్లో చిన్నారి మెదడులో సెరెబ్రోస్పైనల్ ద్రవం అధికంగా పేరుకుపోయినట్లు వైద్యులు గుర్తించారు. దీనివల్ల తీవ్రమైన హైడ్రోసెఫాలస్ ఏర్పడి మెదడుపై ఒత్తిడి పెరిగింది. శిశువుల్లో పుర్రె ఎముకలు పూర్తిగా కలవకపోవడంతో ద్రవం పెరిగేకొద్దీ తల పరిమాణం అసాధారణంగా పెరిగే అవకాశం ఉంటుంది. పరిస్థితి మరింత విషమిస్తే చూపు, నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు మూర్ఛలు, శాశ్వత వైకల్యం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని వైద్యులు గుర్తించారు. హైడ్రోసెఫాలస్‌కు కారణాన్ని గుర్తించే ప్రయత్నంలో మెదడులో అరుదైన గ్లియోన్యూరల్ కణితి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మెదడులోని సున్నితమైన ప్రాంతంలో ఏర్పడిన ఈ కణితి ద్రవ ప్రసరణకు ఆటంకం కలిగిస్తూ పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చినట్లు గుర్తించారు. తొమ్మిది నెలల శిశువుకు మెదడు శస్త్రచికిత్స చేయడం అత్యంత సవాలుతో కూడుకున్నది. చిన్నారి శరీర బరువు, పరిమిత రక్త పరిమాణం, మత్తుమందు నిర్వహణతో పాటు మెదడులోని అతి సున్నితమైన నరాలను కాపాడుకుంటూ శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. దీంతో డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని బృందం అన్ని అంశాలను పరిశీలించి ఒకే విడతలో రెండు కీలక ప్రక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది.

### ఒకే ఆపరేషన్‌లో రెండు ప్రక్రియలు

తొలుత వెంట్రిక్యులో–పెరిటోనియల్ షంట్ ప్రక్రియ ద్వారా మెదడులో అధికంగా పేరుకున్న ద్రవాన్ని ప్రత్యేక నాళం ద్వారా పొత్తికడుపులోకి మళ్లించారు. తద్వారా మెదడుపై ఒత్తిడిని తగ్గించారు. అనంతరం అదే ఆపరేషన్‌లో క్రానియోటమీ నిర్వహించి సూక్ష్మ శస్త్రచికిత్స పద్ధతుల్లో కణితిని తొలగించారు. న్యూరోసర్జరీతో పాటు మత్తుమందు, చిన్నపిల్లల వైద్యం, రేడియాలజీ, అత్యవసర వైద్య విభాగాల బృందాలు సమన్వయంతో పనిచేయడంతో సంక్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతమైంది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి వేగంగా కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. మూడు రోజుల్లోనే స్పృహతో స్పందిస్తూ, పాలు తీసుకుంటూ సాధారణ స్థితికి చేరడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. వేల కిలోమీటర్ల దూరంలోని సోమాలియా నుంచి ప్రాణాలపై ఆశతో హైదరాబాద్‌కు వచ్చిన కుటుంబానికి ఈ వైద్య విజయం కొత్త ఆనందాన్ని అందించింది. అత్యంత చిన్న వయసులో ఉన్న శిశువుకు సంక్లిష్టమైన మెదడు సమస్యలను ఒకే విడతలో పరిష్కరించడం ద్వారా డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని వైద్య బృందం తన నైపుణ్యాన్ని చాటింది. సరిహద్దులు దాటి వచ్చిన పసిప్రాణాన్ని కాపాడిన ఈ శస్త్రచికిత్స హైదరాబాద్ వైద్యరంగ సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది.






# ప్రేమకు ఓ రోజు.. అనుబంధానికి ఓ వేడుక



- స్నేహం.. ప్రేమ.. సహజీవనానికి ప్రతీకగా జంటల దినోత్సవం
- బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ప్రత్యేక సందర్భం
- ఒకరికొకరు సమయం కేటాయించడమే అసలైన కానుక
- ఆప్యాయత, విశ్వాసం, గౌరవమే అనుబంధానికి పునాది
- నేడు జాతీయ జంటల దినోత్సవం



ఇద్దరి మధ్య అనుబంధాన్ని మరింత గాఢంగా మార్చగలవు.

**ప్రేమ అనేది కేవలం మాటల్లో వ్యక్తమయ్యే భావన కాదు. ఒకరిని మరొకరు అర్థం చేసుకోవడం, కష్టసుఖాల్లో తోడుగా నిలవడం, పరస్పరం గౌరవించుకోవడం, జీవిత ప్రయాణాన్ని కలిసి సాగించడం. అలాంటి అనుబంధాన్ని మరోసారి గుర్తుచేసుకునే సందర్భమే జాతీయ జంటల దినోత్సవం. ఏటా ఆగస్టు 18న ఈ రోజును జరుపుకుంటారు. అధికారిక పండుగ కాకపోయినా ప్రేమ, అనుబంధం, పరస్పర సహకారానికి అంకితమైన రోజుగా ప్రాచుర్యం పొందింది.**

### బిజీ జీవితంలో బంధానికి కాస్త సమయం

ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఆధునిక జీవితం ఉరుకులు పరుగులమయంగా మారింది. ఒకే ఇంట్లో ఉంటున్నా మనసు విప్పి మాట్లాడుకునేందుకు సమయం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జీవిత భాగస్వామికి కొంత సమయం కేటాయించడం ఎంత ముఖ్యమో జంటల దినోత్సవం గుర్తుచేస్తోంది. జీవిత భాగస్వాములు, ప్రేమికులు, నిశ్చితార్థం చేసుకున్నవారు ఇలా తమ అనుబంధాన్ని ప్రత్యేకంగా భావించే జంటలు ఈ రోజును తమదైన రీతిలో జరుపుకుంటున్నారు. ఖరీదైన బహుమతులకంటే కలిసి గడిపే కొద్దిసేపు, మనస్ఫూర్తిగా చెప్పే ప్రేమమాట, ఆప్యాయమైన ఆలింగనం ఎంతో విలువైనవిగా మారుతున్నాయి.

### వాణిజ్య ప్రచారం నుంచి ప్రేమ వేడుకగా..

జంటల దినోత్సవానికి సుదీర్ఘమైన చారిత్రక నేపథ్యం లేదు. ఇటీవలి దశాబ్దాల్లోనే దీనికి ప్రాచుర్యం పెరిగింది. తొలుత వాణిజ్య ప్రచారాల్లో భాగంగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ సందర్భం.. సామాజిక మాధ్యమాల విస్తరణతో ప్రేమను, అనుబంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా మారింది. ప్రస్తుతం వివిధ దేశాల్లో యువ జంటలు తమ జ్ఞాపకాలను, చిత్రాలను, ప్రేమ సందేశాలను పంచుకుంటూ ఈ రోజును ప్రత్యేకంగా మార్చుకుంటున్నారు.

### విశ్వాసమే బంధానికి బలం

ఏ బంధమైనా ప్రేమ ఒక్కటితోనే నిలబడదు. పరస్పర విశ్వాసం, గౌరవం, సహనం, అవగాహన కూడా అవసరం. చిన్న చిన్న అపార్థాలను మాట్లాడుకుని పరిష్కరించుకోవడం, ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించడం, కష్టాల్లో అండగా నిలవడం అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఒక పువ్వు ఇవ్వడం.. కలిసి భోజనం చేయడం.. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం.. కలిసి సినిమా చూడడం.. మనసులోని భావాలను ఓ చిన్న లేఖలో రాయడం.. ఇలా సాధారణంగా కనిపించే చిన్న చర్యలే ఇద్దరి మధ్య అనుబంధాన్ని మరింత గాఢంగా మార్చగలవు.





### ప్రేమకు వయసుతో పనేముంది!

జంటల దినోత్సవం అంటే యువ ప్రేమికులకో, కొత్తగా పెళ్లయిన వారికో మాత్రమే పరిమితమైన రోజు కాదు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను కలిసి ఎదుర్కొని దశాబ్దాలుగా ప్రయాణిస్తున్న దంపతులకు కూడా అంతే ప్రత్యేకమైనది. కాలం గడిచేకొద్దీ ప్రేమ రూపం మారవచ్చు. కానీ ఒకరిపై మరొకరికి ఉండే నమ్మకం, తోడు, ఆప్యాయత మరింత బలపడుతుంటాయి. సంతోషకరమైన దాంపత్యం కుటుంబ వాతావరణంపైనా సానుకూల ప్రభావం చూపుతుంది. భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం, అవగాహన ఉన్న కుటుంబాల్లో పిల్లలకు కూడా ఆరోగ్యకరమైన భావోద్వేగ వాతావరణం లభిస్తుంది. అందుకే బలమైన అనుబంధాలు వ్యక్తులకే కాదు.. కుటుంబానికి, సమాజానికీ బలాన్నిస్తాయి.

### ఖరీదైన కానుక కాదు.. కాస్త సమయమే చాలు

జంటల దినోత్సవం చెప్పే సందేశం కూడా ఇదే. ప్రేమను నిరూపించడానికి ఖరీదైన బహుమతులు అవసరం లేదు. 'నేనున్నాను' అనే భరోసా.. 'నీకు విలువిస్తున్నాను' అనే భావన.. కష్టంలో పట్టుకునే చేయి.. ఆనందంలో పంచుకునే చిరునవ్వు–ఇవే నిజమైన కానుకలు.

**ఆగస్టు 18 ఒక తేదీ మాత్రమే కావచ్చు. కానీ ఆ రోజు గుర్తుచేసే విలువ మాత్రం జీవితాంతం అవసరమైనదే. ప్రేమలో ఆనందం.. అనుబంధంలో బలం.. పరస్పర గౌరవంలో నిలకడ ఉంటేనే ఇద్దరి ప్రయాణం అందమైన జ్ఞాపకంగా మారుతుంది. ఒకరినొకరు ప్రేమించుకోవడం ఎంత ముఖ్యమో.. ఆ ప్రేమను ప్రతిరోజూ వ్యక్తం చేయడం అంతకంటే ముఖ్యం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మూడు రోజుల తర్వాత జెండా పండుగ!

- దేశానికి ఆగస్టు 15.. వారికి ఆగస్టు 18న స్వాతంత్ర్య సంబరం
- విభజన గీతతో తూర్పు పాకిస్తాన్‌లోకి వెళ్లిన కొన్ని ప్రాంతాలు
- రాడ్‌క్లిఫ్ అవార్డు వెల్లడయ్యాక మారిన సరిహద్దుల చిత్రం
- భారత్‌లో భాగమయ్యామన్న ఆనందంతో ఎగిరిన త్రివర్ణ పతాకం
- నాడియా, మాల్డాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న చారిత్రక జ్ఞాపకం





భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఆగస్టు 15. దేశమంతా మువ్వన్నెల జెండా రెపరెపలాడిన వేళ.. పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల ప్రజలు మాత్రం తాము భారత్‌లో ఉన్నామా.. తూర్పు పాకిస్తాన్‌లో ఉన్నామా అన్న సందిగ్ధంలో గడపాల్సి వచ్చింది. విభజన సమయంలో సరిహద్దుల నిర్ధారణలో ఏర్పడిన గందరగోళమే ఇందుకు కారణం. చివరకు రాడ్‌క్లిఫ్ సరిహద్దు నిర్ణయం వెల్లడైన తర్వాత పరిస్థితి స్పష్టమై, నాడియా, మాల్డా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు భారత్‌లో భాగమయ్యాయి. ఆ చారిత్రక పరిణామాన్ని గుర్తుచేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో ఆగస్టు 18కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. 1947లో బ్రిటిష్ పాలన నుంచి భారత్ విముక్తి పొందుతున్న సమయంలోనే దేశ విభజన కూడా జరిగింది. భారత్, పాకిస్తాన్ మధ్య సరిహద్దులను నిర్ణయించే బాధ్యత సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్ నేతృత్వంలోని కమిషన్‌కు అప్పగించారు. బెంగాల్ విభజనలో మతపరమైన జనాభాతో పాటు భౌగోళిక, పరిపాలనా అంశాలను పరిగణనలోకి తీసుకుని సరిహద్దులను నిర్ణయించారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15 నాటికి రాడ్‌క్లిఫ్ అవార్డు అధికారికంగా ప్రజలకు వెల్లడికాలేదు. దీంతో బెంగాల్‌లోని అనేక సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర అయోమయం నెలకొంది. నాడియా జిల్లాలోని కొన్ని ప్రాంతాలు తొలుత తూర్పు పాకిస్తాన్‌లో భాగమయ్యాయనే సమాచారం వ్యాపించడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మాల్డా జిల్లాలోనూ ఇదే తరహా అనిశ్చిత పరిస్థితులు కనిపించాయి.

### 17న సరిహద్దుపై స్పష్టత

ఆగస్టు 17న రాడ్‌క్లిఫ్ అవార్డు అధికారికంగా వెల్లడికావడంతో బెంగాల్ సరిహద్దులపై స్పష్టత వచ్చింది. నాడియా జిల్లాలోని అధిక భాగం భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌కు దక్కగా, కొన్ని ప్రాంతాలు తూర్పు పాకిస్తాన్‌లోకి వెళ్లాయి. మాల్డా జిల్లాలోనూ అధిక భాగం భారత్‌లో ఉండగా కొన్ని ప్రాంతాలు తూర్పు పాకిస్తాన్‌లో చేరాయి. ఈ పరిణామంతో అప్పటివరకు భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్న భారత భూభాగంలోకి వచ్చిన ప్రాంతాల ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆగస్టు 18న త్రివర్ణ పతాకాలను ఎగురవేసి తమ ప్రాంతం భారత్‌లో భాగమైన ఆనందాన్ని జరుపుకున్నట్లు స్థానిక చరిత్రలో నమోదైంది.

### శిబ్నిబాస్‌లో ప్రత్యేక సంబరం

నాడియా జిల్లాలోని శిబ్నిబాస్ ప్రాంతంలో ఈ చారిత్రక జ్ఞాపకానికి ప్రత్యేక స్థానం ఉంది. అక్కడ ఆగస్టు 18న త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ నాటి పరిణామాలను గుర్తుచేసుకునే సంప్రదాయం కొనసాగుతోంది. స్వాతంత్ర్యం అంటే కేవలం పాలకులు మారడం కాదని.. తాము ఏ దేశంలో భాగంగా జీవించాలన్న ప్రజల ఆకాంక్షతోనూ ముడిపడి ఉందని నాటి సంఘటన గుర్తుచేస్తోంది.

### ఒక గీత.. వేలాది జీవితాలు

దేశ విభజన సమయంలో కాగితంపై గీసిన సరిహద్దు గీత లక్షలాది మంది జీవితాలను తలకిందులు చేసింది. కొన్ని గ్రామాలు ఒక దేశంలో.. పక్కనే ఉన్న గ్రామాలు మరో దేశంలోకి వెళ్లిపోయాయి. కుటుంబాలు, బంధుత్వాలు, జీవనోపాధులు సరిహద్దులకు ఇరువైపులా విడిపోయాయి. నాడియా, మాల్డా ప్రాంతాల అనుభవం కూడా ఆ విషాద చరిత్రలో భాగమే. అందుకే ఆగస్టు 18 అక్కడి కొన్ని ప్రాంతాలకు క్యాలెండర్‌లో మరో తేదీ మాత్రమే కాదు. సందిగ్ధం తొలగి.. తాము భారత్‌లో భాగమన్న స్పష్టత వచ్చిన చారిత్రక క్షణానికి గుర్తు. దేశమంతా ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటే.. మూడు రోజుల తర్వాత మరోసారి మువ్వన్నెల జెండా ఎగరేసి నాటి చరిత్రను స్మరించుకోవడం ఆ ప్రాంతాల ప్రత్యేకత.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలంగాణ క్రీడాకారులకు 'అర్జున' కిరీటం

- ధనుశ్ శ్రీకాంత్, పుల్లెల గాయత్రికి ప్రతిష్ఠాత్మక పురస్కారం
- 2025 సంవత్సరానికి 17 మందికి అర్జున అవార్డులు
- జాబితాలో దివ్య దేశ్‌ముఖ్, తేజస్విన్ శంకర్, విదిత్ సంతోష్
- ముగ్గురు కోచ్‌లకు ద్రోణాచార్య పురస్కారాలు
- ఈసారి అత్యున్నత 'ఖేల్‌రత్న' ప్రకటించని కేంద్రం





**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** అంతర్జాతీయ క్రీడా వేదికలపై సత్తా చాటుతున్న తెలంగాణ యువ క్రీడాకారులకు అరుదైన గౌరవం దక్కింది. షూటింగ్‌లో పతకాల పంట పండిస్తున్న ధనుశ్ శ్రీకాంత్, బ్యాడ్మింటన్‌లో దూసుకెళ్తున్న పుల్లెల గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డుకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. 2025 సంవత్సరానికి మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున పురస్కారాలను ప్రకటించింది. అర్జున అవార్డుకు ఎంపికైన వారిలో గాయత్రితో కలిసి మహిళల డబుల్స్‌లో ఆడుతున్న ట్రీసా జాలీ కూడా ఉన్నారు. మహిళల చెస్ ప్రపంచకప్ గెలిచిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్, అథ్లెటిక్స్ స్టార్ తేజస్విన్ శంకర్, బాక్సర్ నరేందర్, చెస్ క్రీడాకారుడు విదిత్ సంతోష్ తదితరులు జాబితాలో చోటు దక్కించుకున్నారు.

### ఈసారి 'ఖేల్‌రత్న' లేదు

క్రీడా పురస్కారాల ప్రకటనలో ఈసారి ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్నను కేంద్రం ప్రకటించలేదు. ఎంపిక కమిటీ సిఫారసులు చేసిన దాదాపు ఆరు నెలల తర్వాత అవార్డులను ప్రకటించడం కూడా చర్చనీయాంశమైంది. 1991 తర్వాత క్రీడా పురస్కారాల ప్రకటన ఇంత ఆలస్యం కావడం ఇదే తొలిసారి. బాక్సింగ్ కోచ్ చోటే లాల్ యాదవ్‌తో పాటు పర్వీర్ సింగ్, నేహా చవాన్‌ను ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు.

### అవరోధాలను ఛేదించిన ధనుశ్

పుట్టుకతో వచ్చిన వినికిడి, సంభాషణ లోపాన్ని తన ప్రతిభకు అడ్డంకిగా మారనివ్వకుండా ధనుశ్ శ్రీకాంత్ అంతర్జాతీయ షూటింగ్‌లో ప్రత్యేక ముద్ర వేశాడు. డెఫ్‌లింపిక్స్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత షూటర్‌గా చరిత్ర సృష్టించాడు. 2021 డెఫ్‌లింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ స్వర్ణాలు సాధించాడు. అంతటితో ఆగకుండా సాధారణ షూటర్లతోనూ పోటీపడి తన సత్తా నిరూపించుకున్నాడు. 2023 జూనియర్ ప్రపంచకప్‌లో స్వర్ణం సాధించి వినికిడి లోపం ఉన్న క్రీడాకారుడిగా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు.

### తండ్రి బాటలో గాయత్రి

భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ వారసురాలిగా రాకెట్ పట్టిన గాయత్రి మహిళల డబుల్స్‌లో నిలకడైన ప్రదర్శనతో దేశానికి పతకాలు అందిస్తోంది. ట్రీసా జాలీతో కలిసి 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో రెండు పతకాలు సాధించింది. సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీలో రెండుసార్లు విజేతగా నిలవడంతో పాటు ఒడిశా ఓపెన్ టైటిల్‌ను కూడా సొంతం చేసుకుంది. అంతర్జాతీయ వేదికలపై నిలకడగా రాణిస్తున్న ధనుశ్, గాయత్రికి అర్జున పురస్కారాలు దక్కడం తెలంగాణ క్రీడారంగానికి ప్రత్యేక గౌరవంగా నిలిచింది.



# విరాట్ కోహ్లీ నా 'బ్రదర్'..

## పీవీ సింధు ఆసక్తికర వ్యాఖ్యలు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారత బ్యాడ్మింటన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీతో ఉన్న ప్రత్యేక అనుబంధంపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. విరాట్ కోహ్లీని తాను సొంత సోదరుడిగా భావిస్తానని, కెరీర్‌లోని కష్టకాలంలో ఆయన ఇచ్చిన సలహా తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చివేసిందని వెల్లడించారు. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సింధు, విరాట్‌తో ఉన్న సాన్నిహిత్యం , మైదానంలో ఆయన ప్రదర్శించే పట్టుదలపై ప్రశంసల వర్షం కురిపించారు. కెరీర్‌లో తీవ్ర నిరాశలో ఉన్న సమయంలో ఒకసారి విరాట్ కోహ్లీని కలిసినట్లు సింధు గుర్తుచేసుకున్నారు. ఏదీ కలసిరావడం లేదని తాను చెప్పినప్పుడు, "ఏదీ ఆలోచించకుండా కేవలం మైదానంలోకి అడుగుపెట్టు. నీవు ఏమిటో, నీ కష్టం ఏమిటో నీకు తెలుసు. ఎలాంటి భయం లేకుండా నీ సహజ సిద్ధమైన ఆటను ఆడు. పోయేదేమీ లేదు, నువ్వేంటో ప్రపంచానికి చూపించు" అని విరాట్ ధైర్యం చెప్పినట్లు తెలిపారు. ఆ ఒక్క మాట తనలో సరికొత్త దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొన్నారు. అత్యున్నత స్థాయికి ఎదిగిన క్రీడాకారుడి నుంచి ఇలాంటి ప్రోత్సాహం లభించడం గొప్ప విషయమని, తానేదైనా టోర్నీ గెలిచినప్పుడు ఆ సంతోషాన్ని విరాట్‌తో పంచుకుంటానని సింధు చెప్పారు. ఎంత సాధించినా విరాట్ ప్రదర్శించే క్రమశిక్షణ, నిబద్ధత ఇతరులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ (దీఔఖీ) ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఐదుసార్లు పతక విజేతగా నిలిచిన పీవీ సింధు శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన సోఫియా నోబుల్‌పై 21-7, 21-11 తేడాతో విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లారు. మైదానంలో నిలకడగా రాణిస్తూనే, విరాట్ లాంటి అగ్రశ్రేణి అథ్లెట్ల అనుభవాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నానని సింధు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పది వికెట్లతో లంకను చుట్టేసిన సుతార్

- గాలే టెస్టులో భారత యువ స్పిన్నర్ మాయాజాలం
- రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు
- రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో లంక పతనం
- భారత్‌కు 165 పరుగుల భారీ విజయం
- యువ స్పిన్నర్‌పై సామాజిక మాధ్యమాల్లో ప్రశంసల వర్షం



**గాలే:** శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ బంతితో మాయ చేశాడు. గాలే టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏకంగా పది వికెట్లు పడగొట్టి లంక బ్యాటింగ్ వెన్ను విరిచాడు. సుతార్ స్పిన్ ధాటికి శ్రీలంక బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టగా భారత్ 165 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. కెరీర్‌లో తొలిసారి ఒకే టెస్టులో పది వికెట్ల ఘనతను అందుకున్న సుతార్ మ్యాచ్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లోనే సుతార్ తన స్పిన్ పదును చూపించాడు. 21.4 ఓవర్లలో 76 పరుగులిచ్చి నాలుగు కీలక వికెట్లు పడగొట్టాడు. పిచ్ నుంచి లభించిన సహకారాన్ని చక్కగా ఉపయోగించుకుంటూ లైన్, లెంగ్త్‌తో లంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. మరోవైపు రవీంద్ర జడేజాతో కలిసి ప్రత్యర్థి బ్యాటింగ్ ఆర్డర్‌పై ఒత్తిడి పెంచాడు. రెండో ఇన్నింగ్స్‌లో సుతార్ మరింత ప్రమాదకరంగా మారాడు. 23.4 ఓవర్లలో కేవలం 55 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. పిచ్‌పై లభిస్తున్న టర్న్‌ను సమర్థంగా ఉపయోగించుకుంటూ వరుస విరామాల్లో వికెట్లు తీసి శ్రీలంకను కోలుకోనివ్వలేదు. అతడి స్పిన్‌కు సమాధానం చెప్పలేక లంక బ్యాటర్లు ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు చేరారు. చివరి వికెట్‌గా కేశర నువంతను క్విక్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేసిన సుతార్ మ్యాచ్‌కు ముగింపు పలికాడు. అదే వికెట్‌తో ఒకే టెస్టులో పది వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. వెంటనే గాల్లోకి పంచ్ విసురుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

### అరంగేట్రం చేసిన కొద్ది కాలానికే..

మానవ్ సుతార్ అతి తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేస్తున్నాడు. వైవిధ్యమైన స్పిన్, కచ్చితమైన బంతులతో అంతర్జాతీయ బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ భారత టెస్టు జట్టులో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నాడు. గాలేలో పది వికెట్ల ప్రదర్శన అనంతరం సుతార్‌పై సామాజిక మాధ్యమాల్లో ప్రశంసల వర్షం కురుస్తోంది. అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు కూడా అతడి క్రమశిక్షణ, నియంత్రణను కొనియాడుతున్నారు. భారత టెస్టు స్పిన్ విభాగానికి మరో యువ అస్త్రం దొరికిందంటూ అభిమానులు సంబరపడుతున్నారు.




# హాకీ వరల్డ్‌కప్‌లో గోల్స్ వర్షం

## చరిత్రాత్మక విజయంతో భారత్‌కు అగ్రస్థానం..!

ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టు రికార్డు విజయం నమోదు చేసింది. ఆరంభ పోరులో చైనాకు ముచ్చెమటలు పట్టించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గోల్స్ వర్షం కురిపించి 6-1తో భారీ విక్టరీ కొట్టింది. తద్వారా వరల్డ్‌కప్ చరిత్రలోనే అతిపెద్ద విజయంతో గ్రూప్ డీ నుంచి అగ్రస్థానంలో నిలిచింది టీమిండియా. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో టీమిండియా దుమ్మురేపింది. మొదటి మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని.. ఒడిసిపడుతూ దక్షిణాఫ్రికాను మట్టికరిపించారు భారత అమ్మాయిలు. గ్రూప్ డీ లీగ్ రెండో పోరులో సఫారీలను కంగుతినిపిస్తూ 6--1తో జయభేరి మోగించింది ఆరెంజ్ ఆర్మీ. ఈ మెగా టోర్నీ చరిత్రలో మొన్నటివరకూ 1974లో స్పెయిన్‌పై 4-1 విజయమే భారత్‌కు అత్యుత్తమంగా ఉండేది. కానీ, ఇప్పుడు అది రెండో స్థానానికి పడిపోయింది. ఆట మొదలు నుంచి దూకుడు కనబరిచిన భారత అమ్మాయిలు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై దండయాత్ర చేశారు. సునేలితా టొప్పో, నవ్‌నీత్ కౌర్, సుశీలా చాను, లల్రెమిసియామి, సాక్షి రానాలు తలా ఒక గోల్ కొట్టారు. ఈ విజయంతో 4 పాయింట్లు సాధించిన టీమిండియా అగ్రస్థానం దక్కించుకుంది. మరో మ్యాచ్‌లో చైనా ఇంగ్లండ్‌ను ఓడించింది. ఇక చివరి గ్రూప్ మ్యాచ్‌లో భారత జట్టు ఆగస్టు 20, గురువారం నాడు ఇంగ్లండ్‌ను ఢీకొట్టనుంది. మరొక్క పాయింట్ సాధిస్తే చాలు రెండో రౌండ్ ఆడడం ఖాయం.

# సీఎస్‌కే అభిమానులకు శుభవార్త

## ఇక అంతా ఎంఎస్ ధోనీనే!




**చెన్నై:** ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కొత్త హెడ్ కోచ్ ఎంపికపై తీవ్ర కసరత్తు చేస్తోంది. 18 ఏళ్ల పాటు జట్టుకు హెడ్ కోచ్‌గా సేవలందించిన న్యూజీలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్.. ఇటీవల ఫ్రాంచైజీతో విడిపోయాడు. ఈ నేపథ్యంలో ఆయన స్థానాన్ని భర్తీ చేసే వ్యక్తి కోసం సీఎస్‌కే అన్వేషణ కొనసాగిస్తోంది. ఈ క్రమంలో పలువురు మాజీల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే కొత్త కోచ్ ఎంపికలో లెజెండ్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

### కొత్త కోచ్ ఎంపిక బాధ్యత ధోనీదే:

కొత్త హెడ్ కోచ్ విషయంలో సీఎస్‌కే తొందరపడటం లేదని తెలుస్తోంది. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియను మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పర్యవేక్షిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా విదేశీ కోచ్‌నే నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ జర్నలిస్ట్ వెంకట కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కోచ్ నియామక ప్రకటన అక్టోబర్ తర్వాతే రానుంది. విదేశీ కోచ్ ఎంపిక ప్రక్రియను ధోనీ స్వయంగా పర్యవేక్షిస్తున్నాడట.

### తెరపైకి స్టార్ మాజీ క్రికెటర్ల పేర్లు:

స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు వారసుడిగా పలువురు మాజీ క్రికెటర్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ వంటి పేర్లు సీఎస్‌కే కోచ్ రేసులో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భారత మాజీలు రాహుల్ ద్రవిడ్, హేమంగ్ బదానీ పేర్లు కూడా ఈ రేసులో వినిపించాయి. అయితే విదేశీ కోచ్‌ను నియమించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ద్రవిడ్, బదానీలకు అవకాశం లేనట్టే.

### మైక్ హస్సీకి కూడా అవకాశం:

సీఎస్‌కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ మైక్ హస్సీ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆటగాడిగా సీఎస్‌కే తరఫున సేవలందించిన హస్సీ.. ఆ తర్వాత బ్యాటింగ్ కోచ్‌గా జట్టుతో కొనసాగుతున్నాడు. సీఎస్‌కే వాతావరణం, జట్టు పని విధానం, ఆటగాళ్లతో అనుబంధం వంటి అంశాలపై హస్సీకి మంచి అవగాహన ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశం. గతంలో పలువురు మాజీ క్రికెటర్లు కూడా హస్సీని హెడ్ కోచ్‌గా నియమించాలని సీఎస్‌కేకు సూచించారు.

### హార్దిక్ పాండ్యా విషయంలోనూ ధోనీ కీలక పాత్ర:

మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు సీఎస్‌కే ఆటగాళ్ల ట్రేడింగ్‌పై కూడా ఆసక్తికరమైన ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను సీఎస్‌కేలోకి తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. హార్దిక్ సీఎస్‌కేలో చేరే అవకాశం ఉంటే.. ఈ వ్యవహారంలోనూ ధోనీ కీలక పాత్ర పోషించనున్నాడట. కొత్త హెడ్ కోచ్ ఎంపికతో పాటు ఆటగాళ్ల విషయంలోనూ సీఎస్‌కే ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్

పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఓటీటీలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ).. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి(శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.



## అనుకున్న సమయానికే
# స్పిరిట్ విడుదల
### వాయిదా వార్తలను ఖండించిన టీమ్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్-వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పు లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి డిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.




# నా భర్త మంచోడే
## ఆ అమ్మాయే లొంగదీసుకుంది!



### 'బాసింగ బలాలు' ఫేమ్ ఈశ్వర్‌సాయి వివాదంపై భార్య శరణ్య సంచలన వ్యాఖ్యలు

**ఏడేళ్ల వైవాహిక జీవితంలో ఇలాంటి పరిస్థితి చూడలేదంటూ ఆవేదన**

**తోటి ఫోక్ డాన్సర్‌తో ఏకాంతంగా ఉండగా పట్టుకున్నానని వెల్లడి**

**వేములవాడ పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఫోక్ ఆర్టిస్టుల వివాదం**

**వేములవాడ, ఆగస్టు 19:** జానపద పాటలతో సామాజిక మాధ్యమాల్లో భారీ గుర్తింపు తెచ్చుకున్న 'బాసింగ బలాలు' ఫేమ్ ఈశ్వర్‌సాయి వ్యక్తిగత జీవితం ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. తోటి ఫోక్ డాన్సర్‌తో తన భర్త సన్నిహితంగా ఉన్నాడంటూ ఈశ్వర్‌సాయి భార్య శరణ్య చేసిన ఆరోపణలు ఫోక్ కళారంగంలో చర్చనీయాంశంగా మారాయి. అర్ధరాత్రి సమయంలో వారిద్దరినీ తాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నానని శరణ్య చెబుతుండగా.. తాజాగా ఆమె చేసిన "నా భర్త మంచోడే.. ఆ అమ్మాయే ఆయనను లొంగదీసుకుంది" అన్న వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. ఈశ్వర్‌సాయి-ంతో తనకు ఏడేళ్ల క్రితం వివాహమైందని శరణ్య తెలిపారు. తన భర్త చాలా మంచివాడని, కనీసం మద్యం కూడా తాగడని చెప్పారు. అయితే ఆయనతో కలిసి జానపద గీతాల్లో నటించిన ఓ యువతి కావాలనే తన భర్తకు దగ్గరైందని ఆమె ఆరోపించారు. "ఒక అమ్మాయి అలా వెంటబడితే ఆయన మాత్రం ఏం చేస్తాడు?" అంటూ భర్తను సమర్థిస్తూనే సదరు యువతిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఫోక్ డాన్సర్ తనకు కూడా బాగా పరిచయమని శరణ్య చెప్పారు. గతంలో ఆ యువతి ప్రేమ విఫలమైన సమయంలో తానే దగ్గరుండి ఓదార్చానని తెలిపారు. తన కళ్లముందే తిరుగుతూ ఎంతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తి తన కుటుంబ జీవితంలో ఇలాంటి పరిస్థితికి కారణమవుతుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వర్‌సాయి, సదరు యువతి మధ్య జరిగినట్లు చెబుతున్న మొబైల్ సందేశాలను చూసిన తర్వాతే తనకు అనుమానం బలపడిందని శరణ్య పేర్కొన్నారు. అనంతరం వారిద్దరినీ ఏకాంతంగా ఉన్న సమయంలో పట్టుకున్నట్లు ఆమె చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఈశ్వర్‌సాయి, సదరు యువతి నుంచి పూర్తి వివరణ రావాల్సి ఉంది. ఈ పరిణామాలతో



తాను తీవ్ర మనోవేదనకు గురైనట్లు శరణ్య తెలిపారు. ఒక దశలో తన కుమారుడితో కలిసి జీవితాన్ని ముగించుకోవాలనే ఆలోచన కూడా వచ్చిందని ఆమె చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ జీవితం ఇలా మారిపోతుందని ఎప్పుడూ ఊహించలేదంటూ కన్నీటిపర్యంతమైనట్లు తెలిపారు.

**ఫోక్ సర్కిళ్లలో హాట్‌టాపిక్**

'బాసింగ బలాలు'తో పాటు పలు జానపద గీతాలతో ఈశ్వర్‌సాయి ప్రేక్షకుల్లో గుర్తింపు పొందారు. 'ప్రమీల', 'రాతిరి రాతిరి' వంటి పాటల్లో ఈశ్వర్‌సాయి, సదరు ఫోక్ డాన్సర్ కలిసి నటించినట్లు సమాచారం. తెరపై కలిసి కనిపించిన వీరిద్దరి వ్యక్తిగత వ్యవహారంపై ఇప్పుడు ఆరోపణలు రావడంతో ఫోక్ కళారంగంలో చర్చ మొదలైంది. ఈ వివాదం వేములవాడ పోలీసుల దృష్టికి చేరినట్లు సమాచారం. శరణ్య చేస్తున్న ఆరోపణల్లో వాస్తవమెంత? ఇరువర్గాలు పోలీసులకు ఏం చెప్పాయి? అనే అంశాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు శరణ్య ఆరోపణలపై ఈశ్వర్‌సాయి, సదరు ఫోక్ డాన్సర్ స్పందన కూడా తెలియాల్సి ఉంది.

# టాక్సిక్.. పెద్దల సినిమా మాత్రమే

పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్ సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం.. అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం'.. అని యశ్ అన్నారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com